జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లోనున్న కంద్రం గ్రామంలో గల ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ బృందం శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా టాస్క్ పోర్స్ కమిటీ డీపీ హెచ్ఎన్ వో భూలోకమ్మ ఆధ్వర్యంలో ఆ గ్రామంలో గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో సందర్శన బృందం ఇంటింటి కెళ్లి గర్భిణీలకు వైద్య పరీక్షలను నిర్వహించే మత సంరక్షణకు ప్రభుత్వాలు కల్పించే వైద్య పరీక్షల కార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ వైద్యం అందుతు ఉన్న తీరు ను అడిగి తెలుసుకున్నారు. బాలికలు, అందే ఆరోగ్య పోషకాహారం పై ఆరా తీశారు. మూఢనమ్మకలపై పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ బృందం ప్రతినిధులు సంపత్ కుమార్,వైద్యాధికారి రాంబాబు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బూధరాళ్లను మూడు పంచాయతీలుగా విభజించి అభివృద్ధి చేయండి

- మీకోసంలో కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం
- బూదరాళ్ల సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డ్ మెంబర్ సంజీవ్

విశాలాంధ్ర-కొయ్యూరు : అల్లూరి జిల్లా మండల కేంద్రానికి సుదూర ప్రాంతంలో విసిరి పడేసినట్లు ఉండే బూధ రాళ్ల ను మూడు గ్రామ పంచాయతీలుగా విభజించి అన్ని విధాలా అభివృద్ధి చేసి తమ గిరిజనులను ఆదుకోవాలని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ వినతి పత్రం అందివ్వడం జరిగిందని బూధ రాళ్ల సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ సాగిన సంజీవ్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన పాడేరులో నిర్వహించే మీకోసం కార్యక్రమంలో వినతిపత్రం అందజేయడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూధ రాళ్ల మేజర్ పంచాయతీలో 36 గ్రామాలు ఉండగా ఎనిమిది వేలకు పైబడి జనాభా కలిగి ఉన్నారని, అలాగే విస్తీర్ణ పరంగా కూడా దేశంలోని అతిపెద్ద పంచాయతీ అన్నారు. దీంతో అభివృద్ధికి నోచుకోని అనేక గిరిజన గ్రామాలు నేటికీ ఉన్నాయన్నారు. ముఖ్యంగా మండల కేంద్రానికి 50 కిలోమీటర్ల పైబడి దూరం లో ఉన్న మేజర్ పంచాయతీ బూధ రాళ్లను మూడు గ్రామపంచాయతీలుగా బాలరేవుల పోకల పాలెం, గరిమండ, విభజన చేపట్టి ప్రజల యొక్క సౌకర్యార్థం పరిపాలన సౌలభ్యం కొరకు నూతన పంచాయతీలను పునర్విభజన చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని తెలిపారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ అవకాశాన్ని బట్టి కచ్చితంగా ప్రజల సౌకర్యం పరిపాలన సౌలభ్యం కోసం విభజన చేస్తామని హామీ ఇచ్చారని సర్పంచ్ ముత్యాలమ్మ వార్డు మెంబర్ సంజీవ్ లు తెలియజేశారు.

యువతకు ఇచ్చిన హామీలు తక్షణమే కూటమి ప్రభుత్వం అమలుచేయాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్ర

విశాలాంధ్ర-పాడేరు : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్ర అన్నారు. శుక్రవారం పాడేరులో అల్లూరి జిల్లా అఖిల భారతయువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)ప్రథమ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్ర,సిపిఐ అల్లూరి జిల్లా కార్యదర్శి పి. సత్యనారాయణ, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు డిఎస్సి, పోలీస్, గ్రూప్స్ ఇతర ఉద్యోగాలు నోటిఫికేషన్ విడుదల చేసి, యువతకు న్యాయం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన యువతను మాయ మాటలతో మోసం చేస్తోందన్నారు. ఐటీడీఏ ద్వారా స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.భారత రాజ్యాంగం ప్రకారం షెడ్యూల్ 5, 6 ప్రకారం గిరిజన యువతకు ఎన్నో ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో స్వయం పాలనా అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి అర్ధ సంవత్సరం దాటినా ఇప్పటికి వరకు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం సిగ్గు చేటన్నారు. ఎన్నికల ముందు యువతకు ఎన్నో హామీలు ఇచ్చి గెలిచినా తర్వాత యువతల ఆవేదనను పట్టింపు చేసుకోవటం మర్చిపోయారన్నారు. నిరుద్యోగ భృతి తక్షణమే అమలు చేయాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు పోరాటాలు చేస్తామని హెచ్చరిస్తున్నా మన్నారు. అనంతరం అల్లూరి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక 11 మంది సభ్యులతో జరిగింది. దీంట్లో అధ్యక్షులుగా రాము కార్యదర్శిగా లక్ష్మణులను ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాజశేఖర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు అమర్, రాధకృష్ణ, రాజుబాబు, సిపిఐ మండల కార్యదర్శి చంటి, నాయకులు కృష్ణ, తనీష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు చదువుల పట్ల శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర-హుకుంపేట : బాలికలు చదువుల పట్ల శ్రద్ధ వహించి బాల్య వివాహాలకు దూరంగా ఉంటే ఉన్నత స్థానాలు చేరుకోగలరని సిడిపిఓ బాలమణి దేవి కోరారు. మండలంలోని బాకూరు బాలికల పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో బాలికల తల్లితండ్రులు నిరక్షరాస్యత కారణాల వల్ల బాలికలకు తొందరగా వివాహాలు చేస్తూ వారు బంగారు భవిష్యత్తును చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికలకు విద్యార్థి దశ నుంచే అవగాహన కార్యక్రమాలు కల్పించినట్లయితే వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడమే కాకుండాక వారు ఉన్నత స్థానం అధిరోహిస్తారని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను వినియోగించుకుని విద్యావంతులుగా తయారు కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు మరియు ఎంపీటీసీ, వైద్య అధికారి, ఐపిఆర్ది తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు పార్టీ యాక్షన్ టీమ్ సభ్యుడు సోమడ అరెస్ట్

- నిషేధిత మావోయిస్టు పార్టీకి ఎవరైనా సహకరించిన సంఘ విద్రోహ చర్యలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటాం
- అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్

విశాలాంధ్ర-పాడేరు : నిషేధిత మావోయిస్టు పార్టీకి ఎవరైనా సహకరించి సంఘ విద్రోహ చర్యలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పి అమిత్ బర్దర్ అన్నారు. అల్లూరి జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా సరిహద్దు ప్రాంతంమైన చింతూరు సరిహద్దుల్లో పోలీసుల తనిఖీలో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం శుక్మా జిల్లా కుంటా ఏరియా మావోయిస్టు పార్టీ యాక్షన్ టీమ్ కమాండర్ కొవ్వాసి సోమడ అలియాస్ ముకేష్‌ని పట్టుకొని అరెస్టు చేసామని, ఇతను పలు మావోయిస్టు కార్యకలాపాలలో కీలక పాత్ర పోషించి పోలీసుల తనిఖీల్లో పట్టుబడటంతో అరెస్ట్ చేయడం జరిగిందన్నారు.

జిల్లాలో ప్రవేశించి దాడులకు వ్యూహం పన్నుతుండగా పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారంతో చింతూరు మండలం కల్లేరు గ్రామ శివారులో పట్టుకున్నామని తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు గిరిజన ప్రాంత ప్రజలకు వ్యతిరే మావోయిస్టు పార్టీ ఏంటి డ్రగ్స్ పై తారసపడితే పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు.

గిరిజన ప్రజలు మావోయిస్టులకు సహకరించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇరువురుకి గాయాలు

విశాలాంధ్ర-అడ్డతీగల : ఆర్టీసీ బస్ ఢీకొన్న సంఘటనలో ఇరువురు వ్యక్తులకు స్వల్పంగా గాయాలతో బయట పడిన సంఘటన అడ్డతీగల మండలం ఎల్లవరం గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. అడ్డతీగల నుంచి ఏలేశ్వరం వైపు వెళుతున్న ఇరువురు వ్యక్తులు మోటార్ బైక్ ఎల్లవరం గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సు, బైక్, ఢీకొన్న ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇరువురికి గాయాలయ్యాయి. ఇరువురును ప్రథమ చికిత్స నిమిత్తం ఎల్లవరం ఆసుపత్రికి తరలించారు. ఇరువురు క్షేమంగా ఉన్నట్టు తెలిసింది.

గణతంత్ర వేడుకలకు ఢిల్లీకి సర్పంచ్‌లకు ఆహ్వానం

విశాలాంధ్ర-జి.మాడుగుల : మండల కేంద్రం నుండి 26.01.2025న న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలు (రిపబ్లిక్ డే) కొరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి జేజేఎం పథకాలు అమలు, నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపినందుకు ఆంధ్రపదేశ్ నుంచి 5 జల్లాల నుంచి ఒక్కొక్క సర్పంచ్‌కు ప్రత్యేక ఆహ్వానితులుగా ఢిల్లీకి పిలవటం జరిగింది. అందులో ఏఎస్ఆర్ జిల్లా నుంచి జి.మాడుగుల మండల పాలమామిడి సర్పంచ్ ఎస్.రామకృష్ణ ఎంపిక కావడంతో ఆనందదాయకంగా ఉందని సర్పంచ్ రామకృష్ణ తెలిపారు ఆయనతోపాటు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ విజయకుమార్ పాల్గొన్నారు.

పత్రికా విలేఖర్లు కావలెను

విశాలాంధ్ర తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఈక్రింది మండలాలు
మారేడుమిల్లి, రంపచోడవరం,
ప్రాంతాలకు అనుభవం గల విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెం.
7989138129, 7386603589

మూడు రోజులపాటు ఘనంగా చలి అరకు ఉత్సవాలు : కలెక్టర్ దినేష్‌కుమార్

విశాలాంధ్ర-అరకులోయ : చలి పేరుతో అరకు ఉత్సవాలను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం అరకులోయలోని హరిత రిసార్ట్ గోష్టి సమావేశ వేదికపై ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, అరకు ఉత్సవ్ నిర్వహణకు ఏర్పాట్లు ప్రారంభించడం జరిగిందని, వివిధ రాష్ట్రాల నుండి గిరిజన కళారూపాలను ప్రదర్శించడం జరుగుతుందని, వారివారి సాంస్కృతి, సంప్రదాయాలను ఒకరికొకరు పంచు కొంటూ చేసుకునే అవకాశం ఈ వేదిక పై ఉంటుందని తెలిపారు. ఈ అరకు ఉత్సవము జనవరి 31, ఫిబ్రవరి 1, 2 తేదీలలో ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి రోజైన 31వ తేదీన ఐదు కిలోమీటర్ల మారథన్ రన్‌తో ప్రారంభమవుతుందని, అనంతరం వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన గిరిజన సంస్కృతి సాంప్రదాయాల మేళవింపుతో కార్నివాల్ ఉంటుందన్నారు. పద్మాపురం గార్డెన్స్ లో ఫ్లవర్ షో, ప్రధాన వేదిక వద్ద వివిధ స్టాల్స్, ఫుడ్ స్టాల్స్, అమేజ్మెంట్ ఉంటాయన్నారు. అదేవిధంగా లైవ్ పాటరి, ఇతర లైవ్ కార్యక్రమాలు పర్యాటకుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తామన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రెండవ రోజు అయిన ఫిబ్రవరి ఒకటవ తేదీన సైకిల్ ప్రొఫెషనల్స్ తో 20 కిలోమీటర్ల సైక్లింగ్, అరకు బొకే, పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు, టాలెంట్ షో, ఫ్యాషన్ షో మొదలైనవి ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఇక మూడవ రోజు వెస్టన్ డాన్స్, సాంగ్స్ ఎంటర్టైన్మెంట్ కార్యక్రమాలు ఫైర్ క్రాకర్స్ ఉంటాయని వివరించారు. వరకు ఉత్సవ సందర్భంగా అన్ని పర్యాటక ప్రాంతాలను నో ప్లాస్టిక్ జోన్ గా పరిగణించడం జరుగుతుందని, అందువల్ల పర్యాటకులు ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయం విధిగా వాడాలని కలెక్టర్ సూచించారు. పర్యాటక ప్రాంతాలలో చెత్త చెదారం లేకుండా చూడాలని సూచించారు. ముఖ్యంగా రద్దీ నియంత్రణ పై దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అరకు ఉత్సవ్ ఘనంగా నిర్వహించడానికి, ప్రజలు ప్రజా ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కోరారు.ఈ సందర్భంగా అరకు ఉత్సవ్ చలి ఫ్లవర్ షో పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ప్రధాన వేదిక స్థలానికి పరిశీలించి పలుసూచనలు జారీ చేసారు. ఈ కార్యక్రమం సంయుక్త కలెక్టర్ డా. అభిషేక్ గౌడ, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యా మాన్పటేల్, జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీలు కూలి రేట్లు పెంచాలని ధర్నా

విశాలాంధ్ర-పాచిపెంట : పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న సివిల్ సప్లై గోడౌన్ పనిచేస్తున్న హమాలీలకు ప్రభుత్వం ప్రకటించిన కూలి రేట్లు నెల రోజులు గడుస్తున్న పెంచకపోవడంతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీల సంఘ నాయకుడు జరజాపు నూకరాజు ఆధ్వర్యంలో సివిల్ సప్లై గోడౌన్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన కూలీ రేటు తక్షణమే పెంచకపోతే నిరవధిక దీక్షలు చేపడుతామని ఏఐటీయూసీ మరియు హమాలీల సంఘ నాయకుడు నూకరాజు డిమాండ్ చేశారు. హమాలీలకు ప్రభుత్వం ప్రకటించిన కూలీ రేటు పెంచాలని రాష్ట్ర మంత్రులను పౌరుసరఫరాలశాఖ కమిషనర్ను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలిసినప్పటికీ ఫలితం లేకపోవడంతో నేటి నుండి రాష్ట్రవ్యాప్త ధర్నాలలో భాగంగా మండల కేంద్రమైన పాచిపెంట సివిల్ సప్లై గోడౌన్ వద్ద హమాలీలు ధర్నా నిర్వహించామని పెంచే వరకు విధులకు హాజరుకామని తెలిపారు ప్రభుత్వం కూలి రేటు పెంచుతామని చెప్పి నెలరోజుల గడుస్తున్న నేటి వరకు రేటు పెంచకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లై గోడౌన్‌లో పనిచేస్తున్న హమాలీలు ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నారని నూకరాజు తెలిపారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రకటించిన కూలేరేటు పెంచకపోతే విధులకు హాజరుకామని హమాలీలు తేల్చి చెప్పారు ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన కూల్ రేటు తకణమే పెంచాలని నినాదాలు చేశారు ఈ కార్యక్రమంలో హమాలీలు తోపాటు సివిల్ సప్లై గొడవల్లో పని చేస్తున్న చిరుద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించి వలసలను ఆపాలి

వ్యవసాయ కార్మిక సంఘం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్/బెలగాం : ప్రజలకు ఉపాధి హామీ పనులను తక్షణమే కల్పించి వలసలను నివారించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు నాయకులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ కు మెమొరండం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గరుగుబిల్లి సూరయ్య, బొత్స మోహన్ రావు, ధర్మవరపు పైడిశెట్టి టి.జీవన్ లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న గ్రామాల్లో వెంటనే ఉపాధి పనులు వెంటనే ప్రారంభించాలని, ఈ సంవత్సరం వ్యవసాయ పనులు గ్రామాల్లో ముగియడంతో పండగ ముగియడంతో ఉన్న గ్రామాల్లో ఎటువంటి ఉపాధి అవకాశాలు లేకపోవడంతో వ్యవసాయ కార్మికుల కుటుంబాలతో సహా వలసలు పోవడం జరుగుతుందన్నారు. ఈ వలసలను వెంటనే నివారించాలంటే ఉపాధి పనులు ప్రారంభించాలన్నారు. జాబ్ కార్డు లేని వారందరికీ జాబ్ కార్డులు మంజూరు చేయాలని, రోజువారి కూలీలు 700 రూపాయలు ఇవ్వాలని,ఒక పూటే పని కల్పించాలని,పని ప్రదేశంలో టెంట్, మెడికల్ కిట్టు, మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు పలుగు,పారా పనిముట్లు తదితరు మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు.

పిజిఆర్ఎస్ అర్జీలు పునఃప్రారంభం కారాదు : కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) లో వచ్చిన అర్జీలు పునః ప్రారంభం కారాదని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులకు తేల్చిచెప్పారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవిన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలలో పరిష్కరించగా, మిగిలిన అర్జీలను పిజిఆర్ఎస్ కిందకు తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు. కావున వాటిలో పరిష్కరించదగిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మిగిలిన వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. పరిష్కారమయ్యే సమస్యలతో ఆర్జీదారుడు సంతృప్తి చెందాలని కలెక్టర్ వివరించారు. పరిష్కారం కాని సమస్యలకు తగిన కారణాలను వివరిస్తూ అర్జీదారుకు తెలియజేయాలని అన్నారు. పిఎం జన్ మాన్ పనులు, పిఎంఎవై 2.0 కింద నిర్మిస్తున్న గృహాలు వేగవంతం కావాలని అన్నారు. అనుమతులు పొంది నిర్మాణం కాని గృహాలను తక్షణమే గ్రౌండింగ్ చేయాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే షోకాజ్ నోటీసులు జారీచేస్తామని, ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పిజిఆర్ఎస్ వై కింద జిల్లాలో రహదారులు నిర్మించుకునే అవకాశం ఉందని, కాబట్టి వాటి వివరాలు సేకరించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె. హేమలత, కెఆర్ఆర్సీ ఎస్డీసి పి. ధర్మచంద్రారెడ్డి, డిసిహెచ్ఓ డా. బి. వాగ్దేవి, డిఎంహెచ్ఓ డా. ఎస్. భాస్కరరావు, నోడల్ అధికారి డా. ఎం. వినోద్ కుమార్, డిఆర్డిఏ, డ్వామా పిడిలు వై. సత్యంనాయుడు, కె. రామచంద్రరావు, డిఈఓ డా. ఎన్. తిరుపతినాయుడు, డిపిఓ టీ. కొండలరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా పిఆర్ ఇంజినీరింగ్ అధికారి బి. చంద్రశేఖర్, జిల్లా ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారి ఓ.ప్రభాకరరావు, బిసి సంక్షేమ శాఖాధికారి కృష్ణ, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

ఐటిడిఏ ఏపీవో జి.చిన్నబాబు

విశాలాంధ్ర-సీతంపేట : నేటి కాలంలో బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని ఐటిడిఏ ఏపీవో జి.చిన్నబాబు అన్నారు. శుక్రవారం సీతంపేటలో నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమానికి ఆయన హాజర య్యారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ బాలికలు ఆర్థికంగా, సామాజికంగా, ఆరోగ్య కరంగా, భద్రతగా ఎదగడానికి కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా సీతంపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిడి అన్నదొర, ఎంపీడీవో గీతాంజలి, డిప్యూటీ డిఈఓ, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో...

సాలూరు : లింగ ఆధారిత వివక్షను రూపుమాపడం, సమాజంలో బాలికల ప్రాముఖ్యతను గురించి అవగాహన కల్పించడం కోసం జాతీయ బాలికల దినోత్సవాన్ని జరుపు కుంటున్నామని ఐసిడిఎస్ సిడిపిఓ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలో మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పట్టణంలో స్థానిక బాలికల పాఠశాల విద్యార్థినులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం విద్యార్థినులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ జాతీయ బాలికా దినోత్సవం ప్రతీ ఏటా జనవరి 24వ తేదీన జరుపుకోవాలని 2008లో కేంద్రప్రభుత్వం సూచించిందన్నారు. సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న అసమానతలు, సవాళ్ల గురించి అవగాహన కల్పించారు. బాలికల హక్కులపై అవగాహన కల్పించడం, బాలికా విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారాలకు ప్రాముఖ్యం ఇవ్వడం బాలికా దినోత్సవ లక్ష్యాలని వివరించారు. విద్య లేమితో బాల్యవివాహాలు అధికంగా జరుగుతున్నాయని వాటిని అరికట్టేందుకు పూర్తిస్థాయిలో ప్రయత్నం చేస్తున్నామన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు గుడ్ టచ్, బాడ్ టచ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు సూపర్ వైజర్లు ధనలక్ష్మి, అనురాధ, లక్ష్మి, భారతిలు, కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఏపీ పౌరసరఫరాల గోదాం కళాసులు ధర్నా

విశాలాంధ్ర-సీతంపేట : మండల కేంద్రంలో గల ఏపీ పౌరసరఫరాల గోదాం కళాసులు తమకు పెండింగ్ ఉంచిన ఏరియరస్ తక్షణమే విడుదల చేయాలని కోరుతూ జిల్లా కళాసి యూనియన్ మేస్త్రి పిలుపుమేరకు విధులకు హాజరవ్వకుండా ధర్నా చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం తమకు కల్పించిన అన్ని సౌకర్యాలు తక్షణమే చేకూర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లవ రాజు,చంద్ర వాసు, కాంత రావు,దిలీప్ కుమార్ ,మోహన్,మురళి, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయ అవార్డు గ్రహీతకు కలెక్టర్ ఘన సన్మానం

విశాలాంధ్ర- సీతంపేట: పార్వతీపురం మన్యం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, చేతులమీదుగా ఆరిక, రవీంద్ర ని, సన్మానించారు. మారుమూల దుగ్గి గ్రామంలో సేంద్రీయ వ్యవసాయం చేసి జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకుని అవార్డు అందుకొని జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్ ప్రశంసలు పొంది సన్మానించుకోవడం శుభపరిణామని గ్రామస్తులు కొనియాడారు. గ్రామంలో ఉన్న వ్యక్తి ఇప్పుడు జిల్లా స్థాయిలో ఈ సన్మానం జరగడం, గ్రామస్తులు కుటుంబ సభ్యులు సంతోషిస్తున్నారు. సేంద్రియ వ్యవసాయ సహకార ముఖ్య వక్తులు, డీ.పీ.ఎం పి, షణ్ముఖ రాజు, ఎన్ఎఫ్ఏ వై.తిరుపతిరావు, సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి: పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-సీతంపేట : ఐటిడిఏ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఐటీడీఏ పీవో సి. యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా ఐ.టి.డి.ఏ ప్రగతిని తెలియజేసే విధంగా మరికొన్ని స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. పీఎం జన్ మాన్, జీసిసి, వైద్యం ఆరోగ్యం, పర్యాటకం, వీడీవీకే, ఐసిడిఎస్, రక్షణ శాఖ స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు.కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు త్రాగునీరు సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జి.చినబాబు, డీడీ,అన్నాదొరా, ఎంపిడివో గీతాంజలి, వివిధ శాఖల అధికారులు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జిల్లా అధికారులు

విశాలాంధ్ర-పార్వతీపురం : పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం పలువురు అధికారులు, అనధికారులు, పత్రిక విలేకరులు ఆయనను కలిసి బొకేలను అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, సబ్ కలెక్టర్ మరియు పార్వతీపురం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి కె హేమలత, పాలకొండ సబ్ కలెక్టర్ & సీతమ్మపేట ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి,అదనపు ఎస్పీ డాక్టర్ దిలీప్ కిరణ్,పలువురు జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, పత్రికా విలేఖరులు,తహశీల్దార్లు,తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

రీసర్వేలో డాక్యుమెంట్లు పక్కాగా విచారించాలి

విశాలాంధ్ర-పార్వతీపురం : రీసర్వే పనుల్లో డాక్యుమెంట్లను పక్కాగా విచారణ చేపట్టాలని పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. పార్వతీపురం మండలం గోపాలపురం గ్రామంలో శుక్రవారం పర్యటించి రీసర్వే పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే చేపడుతున్న గ్రామాల్లో ముందుగా సమాచారం అందించాలని, తగు రశీదులు పొందాలని స్పష్టం చేశారు. భూముల రీ సర్వేలో తలెత్తిన లోపాలను భూ యజమానికి ముందుగా నోటీసులో అందించాలని తద్వారా తదుపరి చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. వివాదస్పద భూములకు సంబంధించిన వివరాలు ఆయా రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. రీసర్వేలో ఎక్కడ లోపాలు ఉండరాదని అందుకు అవసరమగు అన్ని చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. రీసర్వే తర్వాత తప్పులు లేని భూ రికార్డులు నెలకొల్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ

విశాలాంధ్ర-హుంకుంపేట : మహిళలకు స్వయం ఉపాధితో పాటు నైపుణ్యం పెంపొందించడానికి ఉచిత టైలరింగ్ శిక్షణ ఇస్తున్నట్లు అప్ హెరాల్డ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అంజూరీ ఫిలిప్ తిమోతి తెలపారు. శుక్రవారం మండలంలోని అడ్డారిమెట క్యాంప్ ఆఫీస్ వద్ద 38 మంది శిక్షణ పొందిన మహిళలకు కుట్టుమిషన్ సర్టిఫికెట్లు వారు చేతులమీదుగా అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు సొంతంగా ఆర్థిక అభివృద్ధి చెందడానికి తోడ్పడుతుందన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టైలరింగ్ టీచర్ కిల్లో మచ్చమ్మ, కోఆర్డినేటర్ గురుమూర్తి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లింక్ రోడ్లను అనుసంధానం చేస్తూ రహదారులు నిర్మాణానికి కంకణం

రెండు కోట్లతో వంతెన నిర్మాణానికి మంత్రి భూమిపూజ

విశాలాంధ్ర-పాచిపెంట : మానవతా దృక్పథం కలిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని శ్రీ శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలో గల రాయి గుడ్డు వలస పంచాయతీ పరిధిలో గల వట్టి గడ్డ వంతెన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేసి భూమి పూజ నిర్వహించారు .ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు .అనునిత్యము ప్రజా సంక్షేమ కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశానికి ఆదర్శమని అన్నారు. హర్యానా రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఏకలవ్య పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు గత ఏడాది గడ్డలో కొట్టుకుపోయిన విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి హుటాహుటిన హెలికాప్టర్పై మృతదేహాలను తరలించి తన మానవతా దృక్పథం చాటుకోవడమే కాకుండా వారి కుటుంబాలలో చెరగని ముద్ర వేసుకున్న ఘనత మన చంద్రబాబు నాయుడుకే దక్కిందని కొనియాడారు. మళ్లీ ఇలాంటి మరణ వార్తల వినకూడదని ఉద్దేశ్యముతో రాయి గుడ్డు వలస సమీపంలో గల వట్టిగడ్డ పై కాజ్వే నిర్మాణానికి అడిగిన వెంటనే రెండు కోట్లు రూపాయలు మంజూరు చేసి గిరిజన హృదయాలలో జరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటలతో మభ్యపెట్టే ముఖ్యమంత్రి కాదని చేతలతో పని చూపించే ఆదర్శ ముఖ్యమంత్రిని ఆమె అన్నారు. వృద్ధులకు దివ్య0గులకు మంచం పట్టిన రోగులకు హితోదికంగా పింఛన్ల మంజూరు చేసి తన మానవత దృక్పథం చాటుకున్నారని అన్నారు .వృద్ధులకు ఈరోజు గౌరవం వాళ్ళ ఇంటిలో గౌరవం దక్కిందంటే అది చంద్రబాబు నాయుడు చలువేనని ఆమె అన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి ఉన్నన్నాళ్లు కాలం ప్రజలు సుభిక్షంగా సంతోషంగా ఉంటారని ఆమె అన్నారు. గిరిజన గ్రామాలను అనుసంధానం చేస్తూ నియోజకవర్గానికి 80 కోట్లు రూపాయలు మంజూరు చేసి ఈ ప్రాంత ప్రజల హృదయాలలో జరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. వచ్చే ఏడాది జూన్ నాటికి ఏకలవ్య పాఠశాలలను ప్రారంభించేందుకు గిరిజనుల విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు అవిశ్రాంతంగా పనిచేసే నిధులు మంజూరుకు కృషిచేసిన ముఖ్యమంత్రి సేవలు మరువలేనివని అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఏకలవ్య పాఠశాలకు శంకుస్థాపన చేసి ఇ%శీ%తవరకు ఒక ఇటుకబెద్ద కూడా పేర్చలేని దుస్థితి గత వైసిపి ప్రభుత్వం దేనిని ఆమె అన్నారు. సమస్యలు పరిష్కరించడానికి ప్రతిరోజు తెలుగుదేశం ప్రభుత్వం సాలూరు కార్యాలయం వద్ద గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని నేరుగా మీ సమస్యలను వివరించి పరిష్కరించుకోవాలని తెలిపారు అనంతరం గిరిజన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు గిరిజన విద్యార్థినులు ఎంతమంది మంచి మంచి హోదాలలో స్థిరపడి మీ మీ కుటుంబాలకు ఆదర్శంగా ఉండాలని అన్నారు. రాయి గుడ్డి వలస పంచాయతీకి వచ్చిన మంత్రి గుమ్మడి సంధ్యారాణికి అఖండ స్వాగతం పలికిన గిరిజనులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ముఖి సూర్యనారాయణ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పిన్నింటి ప్రసాబాబు పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్ మండల తెలుగు యువత అధ్యక్షులు చప్ప కనకారావు నాయకులు కోరుపల్లి సురేష్ మిర్చి వలస సర్పంచ్ ప్రతినిధి పోల్ నాయుడు టిడిపి నాయకులు నర్సింగరావు వెంకటరమణ ఎంపీటీసీ లక్ష్మి సర్పంచ్ కన్నమ్మ గిరిజన నాయకుడు కంటయ్య దొర తదితరులు పాల్గొన్నారు.

నారు శుద్ధితో వరి పంటలో ఉల్లికోడు నివారణ

వ్యవసాయ సహాయ సంచాలకులు మధుసూదన్‌రావు

విశాలాంధ్ర-పాచిపెంట : ప్రస్తుత రబీ సీజన్లో చాలా ఆలస్యంగా వరి నాట్లు పడుతున్నందున ఉల్లి కోడు మరియు కాండం తొలుచు పురుగులు ఆశించే అవకాశం ఉందని ఉల్లికోడును ఒకసారి వచ్చిన తర్వాత నివారణ చర్యలు చేపట్టినా సరైన ఫలితం ఉండదని సాలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం మధుసూదన్ రావు అన్నారు. పాచిపెంట మండలం కోర్టు వలస గ్రామంలో శుక్రవారం వరి నారు మడులను పరిశీలించిన అనంతరం రైతులకు నారు శుద్ధి విధానాన్ని వివరించారు. ప్రధాన పొలంలో సుమారుగా 30 రోజులపాటు పురుగులు ఆశించకుండా ఉండాలంటే నారుమడి యాజమాన్యం తప్పనిసరి అని అన్నారు .నారు తీసే పది రోజులు ముందు కార్బో ఫిరాన్ 3జి గుళికలు వేసుకోవాలని నారు తీసిన పిదప నారుమడి వద్దే చిన్న మడిలా తయారు చేసుకుని అడుగున తార్పాలిన్ వేసుకుని అందులో నీరు నింపి ఒక ఎకరా నారుమడికి 100 మిల్లీలీటర్ల క్లోరిపైరిఫాస్ వేసి రెండు గంటల తర్వాత తీసి నాటుకుంటే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఈ విధంగా చేయడం ద్వారా ప్రధాన పొలంలో 30 రోజుల వరకు పంటకు పురుగులు ఆశించకుండా ఉంటాయని తెలిపారు. ఉల్లి కోడు ఆశించకుండా ముందుగానే ఎకరానికి 10 కిలోల కార్బోఫిరాన్ 3జీ గుళికలను చల్లుకోవాలని సూచించారు. గ్రామ వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు తగు సూచనలు రైతులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు గ్రామ వ్యవసాయ సహాయకులు వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఆరు లక్షల చేప పిల్లలను మంత్రి చేతులమీదుగా విడుదల

- 168 మత్స్యకారుల ఇళ్లల్లో సుఖసంతోషాలు
- మంత్రి గుమ్మడి సంధ్యారాణి

విశాలాంధ్ర-పాచిపెంట : పాచిపెంట పెద్ద గడ్డ జలాశయంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి మరియు శ్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు గుమ్మడి సంధ్యారాణి చేతుల మీదుగా ఆరు లక్షల పదకొండు వేలు చేప పిల్లలను మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేతుల మీదుగా శుక్రవారం పెద్ద గడ్డ జలాశయం లోకి విడుదల చేశారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పెద్ద గడ్డ జలాశయం మత్స్యకారులకు అండగా ప్రభుత్వం ఉందని అన్నారు గత టిడిపి ప్రభుత్వం హయాంలో మత్స్యకారుల కళ్ళల్లో సంతోషాలు వెల్లి విరిసాయని తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం చేప పిల్లలను వదిలిపెట్టే ప్రసక్తే ఎత్తలేదని అన్నారు తర్వాత వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం జలాశయాలలో చేప పిల్లలను వదిలిపెట్టి మత్స్యకారుల కళ్ళల్లో ఆనందం చూసేందుకు చేప పిల్లలను వదల పెట్టడం జరిగిందని అన్నారు జలాశయం ఆవరణలో ఉన్న ఎంతమంది గిరిజనులు ఉన్న కూడా జాలారిల వృత్తిలో జీవనోపాధి పొందేందుకు ఈ పథకం ఎంతో దోహదపడుతుందని అన్నారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అకొంటిత దీక్షతో పనిచేస్తున్నారని అన్నారు ఒక్క చేప పిల్ల ఖరీదు రూపాయి 27 పైసలు పెట్టి కొనుగోలు చేసి జలాశయాలకు లారీల ద్వారా సరఫరా చేసే విడిచిపెట్టడం జరుగుతుందని అన్నారు ప్రతి ఒక్క మత్స్య కారుడు ఈ చేప పిల్లల ద్వారా అభివృద్ధి చెందాలని అన్నారు. గతంలో లాగే మత్స్యకారులకు ఐటీడీఏ ద్వారా చేపలు పంపిణీ తో పాటు వలలు లైఫ్ జాకెట్లు బోట్లు చాపలను తరలించేందుకు ద్విచక్ర వాహనాలు ఇతరత్రా మత్స్యకారులకు సంబంధించిన పనిముట్లను ప్రభుత్వం సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద గాడి జలాశయం నీటి సంఘం అధ్యక్షులు పార్వతి మరియు గంగరాజు మండల పార్టీ అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్ మెట్టివలస సర్పంచ్ ప్రతినిధి కొత్తల పోలి నాయుడు పార్టీ నాయకులు నరసింగరావు కనకారావు సురేషు పాచిపెంట ఉప సర్పంచ్ వెంకటరమణ మండల అధికారులతో పాటు జలాశయ అధికారు పాల్గొన్నారు.

7న బహిరంగ వేలం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : రానున్న 2025- 26 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించి పార్వతీపురం పురపాలక సంఘం ఆధీనములో యున్న రోజువారీ మార్కెట్, రోడ్డు మార్జిన్ నందు ఆశీలు మరియు కమేళాల యందు ఆశీలు వసూళు చేసుకొనే హక్కును ఇచ్చుటకు బహిరంగ వేలం ఫిబ్రవరి 7వ తేదీన శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయ ఆవరణ యందు బహిరంగ వేలం నిర్వహించబడునని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు తెలిపారు.ఆసక్తి గల వారు సదరు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరముల కొరకు కార్యాలయము పని గంటలలో సంప్రదించాలని తెలిపారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

విశాలాంధ్ర-కొమరాడ : దేశంలో రాష్ట్రంలో నిరక్షరాస్యులు ఉండరాదని ప్రవేశపెట్టిన కార్యక్రమం ఉల్లాస్ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి శ్యామల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ 15 సంవత్సరాలు నుంచి 50 సంవత్సరాలులోపు ఉన్న నిరక్షరాస్యలను అక్షరాసులుగా తీర్చిదిద్దేలా కృషి చేయాలని ఎంపీపీ శెట్టిశ్యామల గౌరవ సభ్యురాలు ద్వారపరెడ్డి లక్ష్మి మాట్లాడుతూ శుక్రవారం వెలుగు కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఉల్లాస్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాల ప్రకారం ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా ఉండాలని ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని అలాగే గ్రామాల్లో ఎవరు చదువుకు దూరం కాకుండా ఉండాలని ప్రతి ఒక్కరూ చదువుపై అవగాహన కలిపి ఉండాలని ఆమె అన్నారు. అలాగే ఉల్లాస్ గ్రామైక్య సంఘల పరిధిలో వలువురు మహిళలకు శిక్షణ నిర్వహించారు. గ్రామాల్లో అక్షరాయిత నిరక్షరాస్యులైన మహిళలను పురుషులుగుర్తించి వారికి చదువుపై ఆసక్తి, అలాగే శ్రద్ధగానేర్పించే కార్యక్రమమే ఉల్లాష్ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ప్రతి గ్రామైక్య సంఘాల పరిధిలో 30 మంది చొప్పున నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. యువతతో డిజిటల్ పద్ధతిలో చదువు నేర్పించడం జరుగుతుందన్నారు. కావున ప్రతి నిరాక్షులైన మహిళలు సమయం కేటాయించుకొని చదువు నేర్చుకోవాలన్నారు చదువు నేర్చుకోవడం వల్ల రానున్న రోజుల్లో ఎంతో ఉపయోగపడుతుందని, అందువల్ల ప్రతి ఒక్క నిరాక్షులైన మహిళలు వ్యక్తిగత శ్రద్ధతో ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలోకి రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం మల్లికార్జునరావు వెలుగు ఏపీఎం సురేష్ బాబు సీసీలు వెంకటరమణ విఒఎలు, గ్రామైక్య సంఘాల మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

బొదిగుప్ప గ్రామ పరిష్కార దిశగా కృషి

విశాలాంధ్ర-ఎటపాక : ఎటపాక సిఐ, ఎస్సై సిబ్బంది అద్వర్యంలో ఎటపాక మండలంలోని కన్నయ్య గూడెం పంచాయతీ పరిధిలోగల బోధిగుప్ప గ్రామం వెళ్లి అక్కడ గ్రామ ప్రజలతో మాట్లాడి వారి అవసరములు తెలుసుకున్నారు. వారికి ముఖ్యంగా విద్య, వైద్యం, తాగునీరు సదుపాయాలపై మాట్లాడి సంబంధిత అధికారులతో పరిష్కారం చేస్తామన్నారు. గ్రామ ప్రజలందరూ మంచిగా వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకోవాలని, సమాజంలో గౌరవంగా బతకాలని,చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచనలు ఇచ్చారు. నేడు అభివృద్ధి చెందుతున్న సమాజంలో అభివృద్ధికి తూట్లు పొడుస్తున్న నక్సలిజం వైపు ఎవరూ వెళ్ళవద్దని, వాళ్లకు సపోర్ట్ చేయవద్దని అక్కడ ప్రజలకు చూచించారు. సన్మార్గంలో అందరూ తమ కుటుంబంలో సంతోషంగా గడపాలని సూచించనలిచ్చారు. ఏ ఇబ్బంది ఉన్న పోలీస్ వారు మీముందు ఉంటారని, భరోసా ఇచ్చారు. సమాచారం ఏమైన ఉన్న ఎటపాక పోలీస్‌వారికి తెలియజేయగలరని తెలయజేసారు.

పశుసంపద వృద్ధిచెందితే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు : కలెక్టరు

విశాలాంధ్ర-పార్వతీపురం : గ్రామాల్లో పాడి పశుసంపద వృద్ధిచెందితే పాడి రైతులు ఆర్థిక పరిపుష్టి చెందుతారని, దీన్ని నెరవేర్చడమే ప్రభుత్వ ఆశయమని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం నాడు సీతానగరం మండలంలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాన్ని జిల్లా కలెక్టరు శ్యాం ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పశుపోషణతో జీవన ప్రమాణాలు పెంపొందించుకునే విధంగా ప్రభుత్వం వివిధ పథకాలతో పాడి రైతులకు ఊతమందిస్తుందన్నారు. ఇందులో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది 390 వరకు గోకులాల షెడ్ల నిర్మాణాలకు మంజూరు చేసామన్నారు. పశు కిసాన్ రుణ కార్డు లను అందజేసి లక్షా అరవై వేల వరకు ఎటువంటి పూచీకత్తులు లేకుండా పశు పోషణ నిర్వహణ, పశు గ్రాసాలు కొరకు జీరో వడ్డీతో రుణాలను అందిస్తున్నామని వెల్లడించారు. సహాయక సంఘ సభ్యులకు ఆవులు, గేదెలు, మేకలు,గొర్రెలు కొనుగోలుకు రూ.30 వేల వరకు ఆర్థిక సహాయాన్ని అందజేసి మహిళల ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా చేయూతనందిస్తున్నామన్నారు. రైతులు ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాడి రైతులపై భారం పడకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించి పశువులకు, జీవాలకు ఉచితంగా టీకాలను వేస్తున్నారన్నారు. పశుగ్రాస క్షేత్రాలను నిర్వహించేందుకు రైతులు ముందుకు రాగా తక్షణమే మంజూరు చేయాలన్నారు. వెంకట సాగరం నుండి రాం కోనేరు వరకు ఆక్రములను తొలగించి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరగా రెవెన్యూ, జలవనల శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు పశు సంచార పశు ఆరోగ్య సేవ వాహనాన్ని పరిశీలించి పశు వైద్య చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలు పై విస్తృతంగా అవగాహన కల్పించాలని పశు సంవర్ధక అధికారులను కోరారు.అనంతరం నెలనుంచి 12 నెలల దూడలు ఆరోగ్యంగా ఉండేవిధంగా సంరక్షణ కొరకు రైతుల్లో స్ఫూర్తి నింపేందుకు నిర్వహించిన పశు దూడల ర్యాలీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన దూడల రైతులకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.జిల్లా జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఎస్ మన్మధరావు మాట్లాడుతూ పశువులు ఆరోగ్యంగా ఉండే విధంగా మినరల్ పౌడర్, పశు దాణా ను పాడి రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎదుకు రాణి పశువులకు సకాలంలో ఎదకు వచ్చే విధంగా ఉచిత టీకాల కార్యక్రమం, జీవాలకు నులు పురుగుమందులు, టీకాలు, కోళ్లకు వైరస్ లు సోకుండా టీకాలు వేసే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు బలగ శ్రీరాముల నాయుడు, జడ్పిటిసి మామిడి బాబ్జి, సర్పంచ్ అన్నం నాయుడు,తహశీల్దార్ ప్రసన్న కుమార్, ఎంపీడీవో త్రివిక్రమ రావు, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ దీన కమార్, డా, కత్తుల ప్రసాద్, పశు వైద్యులు డాక్టర్ రామారావు, చక్రధర్, జానకి రామ్, గ్రామ సచివాలయ పశువైద్య సహాయకులు, పాడిరైతులు తదితరులు, పాల్గొన్నారు.

సుగంధద్రవ్యాల నిమ్మగడ్డి పంటను విరివిగా పండించండి

ఔత్సాహిక రైతులకు 50 శాతం వరకు సబ్సిడీ
జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా వేయి ఎకరాల్లో సాగుకు శ్రీకారం : కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో సుగంధద్రవ్యాల నిమ్మగడ్డి పంటను పండించడానికి వాతావరణం అనుకూలంగా ఉంటుందని కావున ఈ పంటను విరివిగా పండించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ రైతులకు పిలుపునిచ్చారు. స్వల్పకాలంలో అధిక దిగుబడి పంటగా దీన్ని గుర్తించడం జరిగిందని, ప్రక్క రాష్ట్రమైన ఒడిషాలోని ప్రతీ గ్రామంలోను రైతులు ఈ పంటను వేసి మంచి లాభాలు ఆర్జించారని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా వేయి ఎకరాల్లో నిమ్మగడ్డి పంటను రైతులు సాగుచేసేలా శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు. తద్వారా జిల్లాలోని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఈ పంటను పండించే రైతులకు రెండు విడతల్లో 50 శాతం వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ ఒక ప్రకటన జారీచేశారు. 2025 - 26 సం.రంలో ఎంఐడిహెచ్ పథకం కింద జిల్లాలో 1,000 ఎకరాల్లో నిమ్మగడ్డి సాగుకు రూ.100 లక్షల రాయితీని ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఒక ఎకరాకు సుమారు 50 వేల మొక్కలు నాటాలని, మొక్కల కొనుగోలుకు రూ.20 వేలు ఖర్చు కాగా, అందులో గిరిజన రైతులకు 50శాతం సబ్సిడీని ఇవ్వనున్నట్లు చెప్పారు. మొదట విడతలో మొక్కల ఖర్చుపై రూ.6,000/-లు, రెండవ విడతలో సాగు ఖర్చుపై రూ. 4,000/-లు వెరశి రూ.10 వేల సబ్సిడీని విడుదల చేయనున్నట్లు తెలిపారు. బిసి, ఎస్సి, ఇతర కేటగిరీల రైతులకు 40 శాతం సబ్సిడీతో మొదట విడత కింద రూ. 4,800/-లు, రెండవ విడతగా రూ. 3,200/-లు వెరశి రూ. 8వేల సబ్సిడీ సొమ్మును విడుదల చేయనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. కావున పొలం కలిగి, నిమ్మగడ్డి సాగుకు నీటి వసతి సౌకర్యం ఉన్న ఆసక్తి గల రైతులు తమ నివాస గ్రామాలలో ఉండే గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించి వివరాలను తెలుసుకుని తమ వివరాలను నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

బిక్షాటన చేసిన రోజులను గుర్తుకు తెచ్చుకోండి

- వైకాపా ప్రభుత్వంలో భిక్షాటన చేసిన సర్పంచ్‌లు ఆవిషయాన్ని గుర్తు చేసుకుని ఆరోపణలు గుప్పించాలి
- తెదేపా పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి ఈశ్వరి

విశాలాంధ్ర-చింతపల్లి : గత ప్రభుత్వంలో ఎదుర్కొన్న పరిస్థితులను, చేసిన బిక్షాటనను సర్పంచ్ లు గుర్తు తెచ్చుకుని ప్రకటనలు ఇవ్వాలని తెదేపా పాడేరు నియోజకవర్గం ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి అన్నారు. మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ కొత్త పాకలు గ్రామంలో ఆ పంచాయతీ సర్పంచ్ చింతర్ల సునీల్, ఎంపీటీసీ సభ్యుడు పాంగి బాబురావు ల ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కొత్త పాకల గ్రామస్తులు ఆమెకు గ్రామానికి కూతవేటు దూరము నుండి దింసా నృత్యాలతో సాదర స్వాగతం పలికారు. అనంతరం సర్పంచ్ సునీల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ (వైకాపా) ఐదేళ్ల పాలనలో గాడి తప్పిన రాష్ట్ర అభివృద్ధిని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లోనే గాడిన పెట్టిందన్నారు. పంచాయతీ వ్యవస్థను నాశనం చేసి సర్పంచ్ లను వైకాపా ప్రభుత్వం ఉత్సవ విగ్రహాల్లా చేస్తే, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చి రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీలకు ప్రథమ ప్రాధాన్యతను ఇచ్చి పంచాయతీలన్నింటిలో ఒకేసారి తీర్మానాలు చేసి చరిత్ర లిఖించారన్నారు. అభివృద్ధి అంటే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అనే విధంగా అభివృద్ధి, సంక్షేమాలకు నిధులు మంజూరు చేయడమే గాక, ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సూపర్ గా అమలు చేస్తున్న ప్రభుత్వం ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం అన్నారు. అధికార దర్పంతో వై నాట్ 175 అనే నినాదంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేసిన వైకాపాకు విజ్ఞులైన ప్రజలు కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం ప్రభంజనం ఉన్నప్పటికీ మన్య ప్రాంతంలో అమాయకులైన గిరిజనులు వైకాపాను ఆదరించి శాసనసభ్యులుగా, పార్లమెంటు సభ్యులుగా అవకాశం కల్పిస్తే వైకాపా ఎమ్మెల్యేలు, ఎంపీలు చట్టసభలకు వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా బయటనే ఉండి అర్థం లేని ప్రకటనలతో ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. సర్పంచులు సైతం గత ప్రభుత్వంలో వారు ఎదుర్కొన్న పరిస్థితులను మరచిపోయి ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ప్రకటనలు గుప్పిస్తున్నారని, గత ప్రభుత్వంలో నిధులు లేక వారు ఎదుర్కొన్న ఇబ్బందులు, చేసిన బిక్షాటన మరచిపోయి ప్రకటనలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా వైకాపా ప్రజా ప్రతినిధులు తమ ప్రభుత్వ ఐదేళ్ల పాలనకు, ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ఆరు మాసాల పాలనకు వ్యత్యాసం గమనించి మాట్లాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు, సీనియర్ నాయకులు చల్లంగి లక్ష్మణరావు, పెదిరెడ్ల బేతాళుడు, గెమ్మేల అబ్బాయి నాయుడు, చెన్నకేశవ నాయుడు, గోసరెడ్డి సోమేశ్వరరావు, అరకు పార్లమెంట్ ఎస్సీ సెల్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుందూరు రాజు, యశ్వంత్, భీమన్న, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎస్ కంతం నాయుడు, శెట్టి నాగేశ్వరరావు, ఎన్డీఏ కూటమి నాయకులు, గ్రామస్తులు, తెదేపా కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మండలంలో ఉపాధి హామీ బహిరంగ విచారణ



విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండల పరిధిలోగల 31 పంచాయతీలలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పంచాయతీరాజ్ ఐటిడిఎలకు సంబంధించి 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనుల్లో భారీ అవకతవకులు జరిగినట్లు నిర్ధారణ అయింది. దీనికి సంబంధించి శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో జరిగిన బహిరంగ సమావేశంలో తేటతెల్లమయింది. ఏప్రిల్ ఒకటి 2023 నుండి మార్చి 31 2024 మధ్యకాలంలో ఉపాధి హామీకి జరిగిన 2,593 పనులుకుతాను కూలీల కింద రూ.22,25,49,134 లతో పాటు మెటీరియల్ రూపంలో 94,65,176 రూపాయలు కలిసి మొత్తము 23,20,14,310 పంచాయతీరాజ్ పనులకు రెండు కోట్ల 23,31,921 రూపాయి ఐటిడిఎ పనులకు ఐదు కోట్ల రూ.18,52,545లు కలిపి మొత్తం రూ.30,61,98,776లపై సామాజిక తనిఖీ ఎస్ఆర్పి బి. దాస్ నేతృత్వంలో మరో ఎస్ఆర్పి 15 మంది డిఆర్పీలు సెప్టెంబర్ 26, 2024 నుండి అక్టోబర్ 9, 2024 వరకు గ్రామాల్లో తిరిగి తనిఖీ చేశారు. శుక్రవారం దీనికి బహిరంగ విచారణ జరిగింది. వచ్చిన అవకతవకలపై పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని ఎంపిపి బొంగు సురేష్ ఉన్నతాధికారులను కోరారు. వాలంటీర్లకు సంబంధించి ఉపాధ్యాయుని పథకంలో మూడు రోజులు పనులు ఇవ్వాలని అప్పటి వైసిపి ప్రభుత్వం జీరో జారీచేసిన వారం రోజుల పాటు పనులు ఇచ్చి 15 పంచాయతీలు బిల్లు చెల్లించినట్లు నిర్ధారణ అయింది. శిఖబడి పంచాయతీలో ప్రత్యేకంగా చనిపోయిన వారి పేర బిల్లులు చెల్లించడం పలువురు అధికారులు కృష్ణయానికి గురయ్యారు. మండలంలో 21 పంచాయతీలలో మస్తర్లపై సంతకాలు గాని వేలిముద్రలు గాని లేకుండానే పేమెంట్లు చేసినట్లు పనికి బృందం గుర్తించి అధికారుల ముందు ఉంచింది. ఏజెన్సీ పంచాయతీలో స్టోన్ బండ్లు ఫారం పాండ్లు పనుల్లో కొలతల్లో తేడా ఉన్నట్లు గుర్తించారు. దాదాపు అన్ని పంచాయితీల్లో పని వద్ద బోర్డులు ఏర్పాటు చేయకుండా సుమారు 9 లక్షల వరకు డ్రా అయితే తిరిగి ప్రభుత్వ ఖాతాకు జమ చేశామని క్షేత్ర సాంకేతిక సహాయకులు అధికారుల ముందు చెప్పిన జమ అయినట్లు ఎంపిడిఓ రమేష్ సంతకంతో జాబితా వస్తేనే అంగీకరిస్తామని అధికారులు తెలిపారు. అల్లువాడ, కుదమ పంచాయతీలలో బినామి పేర్ల బిల్లులు చెల్లించి డబ్బులు వసూలు చేసినట్లు అధికారులు నిర్ధారించారు. ఈ మొత్తం అవకతవకలపై పూర్తి నివేదిక ఇంకా రావాల్సి ఉంది. ఈ కార్యక్రమం లో డిఎల్ డిఓ ఎన్. రమేష్ రామన్ ఎపిడి శ్రీహరిరావు, జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటరమణ ఎంపిడిఓ శంబంగి రమేష్, ఎపిఓ కలిశెట్టి శ్రీనివాసరావు, జెఈ తెజేశ్వరరావు, ఎస్ఆర్పీలు డిఆర్పీలు మండల టెక్నికల్ అసిస్టెంట్స్ క్షేత్ర సహాయకుల పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్ల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం ఎల్ఐసి బ్రాంచ్ పరిధిలో ఏజెంట్ల వృత్తి పరిరక్షణ దినం సందర్భంగా ఎల్ఐసి ఏజెంట్ల సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ డివిజన్ ఎల్ఐసి ఏజెంట్ల ఎన్నికల అధికారిగా లాడి స్వరూప కుమార్ బాధ్యతను వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఎల్ఐసి ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడుతూ ఏజెంట్లు ఐక్యత ఎంత అవసరమో తెలియజేశారు. అంతేకాకుండా గత ఏడాది అక్టోబర్ నెల నుండి ఇప్పటివరకు ఎల్ఐసి సంస్థలో అనేక మార్పులు రావడంతో అటు ఏజెంట్లకు జరుగుతున్న నష్టాన్ని గుర్తు చేశారు. అలాగే పాలసీదారుల కడుతున్న ప్రతి రూపాయికు భరోసా ఇస్తూ ఎల్ఐసిని ప్రపంచంలో నెంబర్ వన్ సంస్థగా చేస్తున్నప్పటికీ ఐఆర్డిఎ తీసుకుంటున్న మార్పులతో అటు సంస్థకు ఏజెంట్లకు పరోక్షంగా నష్టం జరుగుతున్న నేపథ్యంలో ఏజెంట్ల ఐక్యత ఎంతో అవసరమని ఇందుకోసం కార్యవర్గ ఎన్నిక అనివార్యమని తెలిపారు. అనంతరం ఎల్ఐసి ఏజెంట్ల సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పార్వతీపురం బ్రాంచ్ ఎల్ఐసి అధ్యక్షులుగా లచ్చిపాత్రుని రామకృష్ణ కార్యదర్శిగా మద్రాపు నారాయణ స్వామి కోశాధికారిగా కొత్తకోట రమేష్, ఉపాధ్యక్షులుగా చెరుకూరు జగదీశ్వరరావు, గౌరవాధ్యక్షులుగా పోలిశెట్టి నాగేశ్వరరావు, చెక్కా వెంకట్రావు, గుంట్రెడ్డి జగన్నాథం నాయుడుతో పాటు ఉపాధ్యక్షులుగా ఎం. సన్యాసినాయుడు (రంగనాథ్) మందాది శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీగా తూముల శ్రీనివాసరావు, తులాల కేశవరావు, పిట్టల గోపాలరావు ఎంపికను సాలూరు, బొబ్బిలి పార్వతీపురం నుండి హాజరైన 250 మంది ఎల్ఐసి ఏజెంట్లు తమ పూర్తి ఆమోదాన్ని తెలపడంతో ఎన్నిక జరిగినట్లు తెలిపారు. అనంతరం బ్రాంచ్లో అత్యధిక వ్యాపారం చేసినందుకుగాను గెంబలి కేశవరావు, రొంపిల్లి శంకర్రావు కె. తవిటినాయుడు, తూముల శ్రీనివాసరావు జగన్మోహన్ రావులను నూతన కార్యవర్గం తరఫున వారిని సత్కరించారు.

ఏకలవ్యలో రెండో రోజు వంటవార్పుతో బాధితులు నిరసన

విశాలాంధ్ర-డుంబ్రిగూడ : మడల కేంద్రంలో ఏకలవ్య విద్యాలయానికి భూములు ఇచ్చిన గిరిజనలు రెండో రోజు వంటవార్పు కార్యక్రమాన్ని నిర్వహించి భూ బాధితులు నిరసన వ్యక్తం చేశారు . పాఠశాల నిర్మాణానికి స్థలం ఇస్తే ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్న యోచనతో నాలుగు గిరిజన కుటుంబాలు పట్టా భూములను ఇస్తే తమకు ఎటువంటి ఉద్యోగ ఉపాధి అవకాశాలు అధికారులు కల్పించకుండా నిర్లక్ష్య ధోరణి చేస్తున్నారని బాధితులు ఆరోపించారు. అధికారుల తీరుతో విసుగు చెందిన సాగు భూములు ఇచ్చిన బాధిత గిరిజనులు వంటవార్పుతోపాటు టెంట్లు వేసి అందోళన చేస్తున్నారు. విద్యాలయంలో ఉపాధిని కల్పించేంత వరకు ఆందోళన చేపడతామని బాధిత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఏకలవ్య విద్యాలయంలో ఉపాధిని కల్పించి అదుకోవాలని బాధితులు కోరారు. నిరసన కార్యక్రమంలో కుటుంబం సమేతంగా పాల్గొన్నారు.

ఆదివాసి సంస్కృతి భవితరాలకు అందించాలి : ఎంఈఓ

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాలను గిరి విద్యార్థులకు ప్రాథమిక విద్యార్థి దశలోనే అవగాహన పరచి నెమరు వేసుకుంటూ భావితరాలకు అందించే విధంగా చూడాలని మండల విద్యాశాఖ అధికారి ఎస్ సుందర్ రావు సూచించారు. మండలంలోని తూటంగి, లైగండ, గుంటగన్నెల పంచాయతీ పరిధిలోని పాఠశాల ఉపాధ్యాయులకు, సిపిఎఫ్ నియమించిన వాలంటీర్లకు సిపిఎఫ్ ఆధ్వర్యంలో ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి సంస్కృతి కనుమరుగుతున్న తరుణంలో సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఆ సంస్థ ప్రోగ్రాం అధికారి నాగమణి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గాసినాయుడు, సీసీ మాలతి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

విశాలాంధ్ర-కొమరాడ : కస్తూరిబాయ్ గాంధీ విద్యాలయం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష, జిల్లా మహిళా & శిశు సంక్షేమ శాఖ ఐఆర్పి డబ్ల్యూ ఏ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, పార్వతిపురం పాసింజర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కస్తూరిబాయ్ బాలికల పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కనకదుర్గరు హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల ఉద్దేశిస్తూ పాత రోజుల్లో ఇప్పుడున్న సదుపాయాలు గాని పరిస్థితులు గాని లేవు, ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలకి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది, ఆధునిక యుగంలో ఫోన్ ఫెసిలిటీ నెట్ ఫెసిలిటీ ఉన్నది కనుక బాలికలు మంచి విషయాలు పై శ్రద్ధ చూపాలని ఆమె ఈ సందర్భంగా చెప్పారు అలాగే చైల్డ్ మ్యారేజ్ మీద బాలికలు చాలా అవగాహన సదస్సులు మా డిపార్ట్మెంట్ నుంచి పెడుతున్నామని అని తెలియజేశారు, అందుకే కాన్సెప్ట్ పోవాలి, అక్రమ రవాణా అరికట్టాలి అని సందర్భంగా ఆమె తెలియజేశార కస్తూర్బాయ్ గాంధీ బాలికల విద్యార్థులు ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమం విశిష్టత హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి ఎం తిరుపతి నాయుడు మాట్లాడుతూ విద్యార్థి దశనుండి సంకల్ప బలంతో చదవాలని, చక్కన ప్రణాళిక తయారు చేసుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జీసిడిఓ మధు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే వ్యక్తిగతంగా ఆలోచించి, మంచి దృక్పథంతో విజయం సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. పార్వతిపురం మన్యంజిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఎం.శ్రీరాములు ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి ఆలోచన విధానంతో సామాజిక దృక్పథంతో ఉండాలని, ఆడపిల్ల ఇంటికి లక్ష్మీదేవిని, ప్రతి ఒక్క ఆడపిల్ల తల్లిదండ్రులు మంచి మంచి పేరు వచ్చేలా ప్రవర్తించాలని సూచించారు, ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా విద్యార్థులకు సుమారు 50 మందికి దోమతెరలు పంపిణీ చేశారు. అనంతరం బాలల సంక్షేమ మాజీ అధ్యక్షులు ప్రసాదరావు పట్నాయక్ మాట్లాడుతూ బాలికలు టెక్నాలజీని ఉపయోగించుకుని మంచి విషయాలు సేకరించి ముందు కొనసాగాలని, నేటి మొబైల్స్ ఇంటర్నెట్తో చెడు మార్గాన్ని వెళ్ళరాదని ఆయన సూచించారు. కొమరాడ మండల అభివృద్ధి అధికారి మల్లికార్జున మాట్లాడుతూ బాలికలు మహా శక్తిమంతులని, సమాజంలో చాలా ఓర్పుగా ఉంటారని మహిళా ఒక శక్తిని ఆయన సందర్భం కొనియాడారు. ఈ సందర్భంగా పాసింజర్ కమిటీ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్ బాలికల ఏసమస్య వచ్చినా సమస్యను అర్థం చేసుకొని సంస్థ పరిష్కార దిశగా పాసింజర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ అరుణ్ డీఈఓ, రెడ్ క్రాస్ చైర్మన్ సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాసింజర్స్ అసోసియేషన్ సెక్రెటరీ వి.శ్రీహరి ఐఆర్పి డబ్ల్యూ సంస్థ డైరెక్టర్ ప్రకాష్, కొమరాడ కస్తూరిబాయి గాంధీ విద్యాలయ బాలికలు, టీచర్స్, నాన్ టీచింగ్ స్టాఫ్, కొమురాడ మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, హాజరైనరు ఐఆర్పిడబ్ల్యూఏ సిబ్బంది సత్యనారాయణ, లక్ష్మణ్, లక్ష్మీ నాయుడు విద్యార్థులు ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శు

క్రవారం జాతీయ బాలికల దినోత్సవము ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు వ్యాసరచన పోటీ, డ్రాయింగ్ కంపిటేషన్స్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అపూర్వ భరత్ విచ్చేసి బాలికలను ఉద్దేశించి ప్రసంగించారు. బాలికలు అందరు చక్కగా చదువుకుని అన్నీ రంగాల్లో రాణించాలని అదేవిధంగా విద్యార్థులు అందరు వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలని, క్రమశిక్షణతో జీవించాలని, మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో గెలుపొందిన వారికీ బహుమతులు అందచేశారు. పాఠశాల గణిత,హిందీ, ఆంగ్ల ఉపాధ్యాయులతో పిల్లల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన బాలికలకు ఐటీడీఏ తరపున ప్రత్యేక బహుమతి అందిస్తానని ఈ కార్యక్రమంలో భాగంగా తెలిపారు. అదేవిధంగా జిల్లా ఉపవైద్యాధికారి . వి.పుల్లయ్య మాట్లాడుతూ చదువుతో పాటు ఆరోగ్యం కూడా చాలా అవసరం అని, రక్తహీనత బారినపడకుండా పిల్లలే వారి తల్లిదండ్రులకు అవగాహన కలిగించేవిధంగా ఉండాలని చెప్పారు.మొదట 25 సంవత్సరాలు ఏపిల్లలు అయితే కష్టపడతారు వారు లైఫ్లోపైకి ఎదుగుతారు అని చెప్పియున్నారు. ఒకరికి ఒకరు సపోర్టుగా అంటూ తోటి వారికి సహాయం చేసే విధంగా ఉండాలని పిల్లలకు సూచించారు. అత్యున్నత స్థానాల్లో ఉన్న మహిళలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని, చదువుతోనే సాధికారత సాధించగలరని, సమాజంలో అసమానతలు తొలగాలి అంటే అందరూ బాలికలు ఉన్నత స్థానాల్లో ఉండే విధంగా కృషి చేయాలని చెప్పియున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్సై రమేష్ బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో ఎవరు కూడా పర్సనల్ ఇన్ఫర్మేషన్, ఫోటోస్ షేర్ చెయ్యకూడదని , సమాజంలో బాలికలు, మహిళలు పైన జరుగుతున్న అటువంటి అన్యాయాలు పైన అందరూ అవగాహన కలిగి ఉండాలని, వాటిని ఎదురించి పోరాడే విధంగా తయారువ్వాలని ఈకార్యక్రమంలో భాగంగా తెలియజేసారు. ఈ కార్యక్రమన్ని ఉద్దేశించి మండల రెవెన్యూ అధికారి చిరంజీవి మాట్లాడుతూ బాలికలు ఎటువంటి ప్రలోభాలకు లోనవ్వకూడదని మంచి స్థాయిలో ఉండాలన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి విజయగౌరి మాట్లాడుతూ బాలికలందరు చదువుపైన శ్రద్ధ చూపించాలని, అత్యున్నత స్థానాల్లో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహ నిర్మూలన చట్టం 2006, న్యూట్రిషన్, పోస్కో చట్టం మొదలగు అంశాలపై బాలికలకు అవగాహన కల్పించాలన్నా రు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బాలకృష్ణ ,ఉపాధ్యాయ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శు

క్రవారం జాతీయ బాలికా దినోత్సవంను నిర్వహించారు. బాలికల ఎదుగుదలకు ఆత్మస్థైర్యం, పట్టుదల ఎంతో అవసరమని నేటి సమాజంలో ఆడపిల్లల పై జరుగుతున్న అఘాత్యాలను ఖండిస్తూ బాలికావిద్య ఆవశ్యకతను ప్రధానోపాధ్యాయిని ఇల్లా ప్రసన్నలక్ష్మి వివరించారు. భారతదేశ తొలి మహిళాప్రధానమంత్రి ఇందిరాగాంధీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన దినాన్ని పురస్కరించుకుని 2008 నుండి భారత ప్రభుత్వం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. పాఠశాలలో బాలురు కంటే బాలికలే అన్నింట ముందుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ యు.పూర్ణిమ, ఉపాధ్యాయినులు ఐ.పద్మావతి, వి.ప్రమీల,జి లక్ష్మీ సుభద్రమ్మ మరియు బి.రేణుక మరియు అంగన్వాడి కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : జాతీయ బాలికల దినోత్సవంలో భాగంగా స్థానిక లయన్స్ కళ్యాణ మండపంలో జిల్లా స్థాయి బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమాన్ని నేడు నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి డా. టి. కనకదుర్గ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 9.00 గం.ల నుంచి మధ్యాహ్నం 1.00 గం. వరకు కార్యక్రమం జరగనుందని, ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొంటారని ఆమె ఆ ప్రకటనలో వివరించారు.

గంగవరం : స్థానిక ప్రభుత్వగిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ (ఐసిడిఎస్) సిడిపిఓ సిహెచ్ లక్ష్మి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పురుషులతో పాటు అన్ని రంగాలలోనూ పోటీ పడుతున్నారని విద్యార్థి స్థాయి నుంచి అన్ని రంగాలలో పోటీ తత్వాన్ని బాలికలు అలవర్చుకోవాలని అన్నారు. సందర్భంగా పిల్లలకు లైఫ్ స్కిల్స్ పై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. బాలికలపై జరిగే నేరాలు, అఘాయిత్యాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు రూపుమాపేందుకు సమాజంలో ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు బాలికలు విజయలు ఎలా సాదించాలి, అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి టి.మల్లేశ్వరరావు, ఏఎస్ఐ రజాక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ వరలక్ష్మి,

ఐసిడిఎస్ సూపర్వైజర్ టి సత్యవతి, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ సమైక్య సభ్యులు హాజరయ్యారు.

రాజవొమ్మంగి : జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా రాజవొమ్మంగి సీడీపీఓ ఎల్ దేవమని అధ్యక్షతన రాజవొమ్మంగి

జిల్లాపరిషత్ హైస్కూల్, సింగంపల్లి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల,జడ్డంగి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో 8,9,10 వ తరగతి ఆడ పిల్లలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు,ఆడపిల్లలు బాగా చదువుకొని అన్ని రంగాలలో ముందుండాలని,తమ జీవిత లక్ష్యలను సాధించాలని తెలిపారు,యుక్త వయస్సులో వచ్చే సమస్యలను ధైర్య%శీ% గా ముందడుగు వేయాలని వివరంగా తెలియజేశారు, అలాగే వారి యొక్క హక్కులు, చట్టాలు గురించి, హెల్ప్ లైన్ నంబర్స్ గురించి కూడా చెప్పడం జరిగింది,18 సంవత్సరాలు నిండకుండా ఎవరు పెళ్లిళ్లు చేసుకోకూడదని, ఎక్కడైనా అలా పెళ్లిళ్లు జరిగితే ప్రభుత్వ అధికారులకు తెలియజేయాలనీ, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యకగత పరిశుభ్రత పాటించాలని మొదలైన విషయాలు గురించి బాలికలకు వివరంగా చెప్పడం జరిగింది,ఈ కార్యక్రమం ఐసీడీఎస్ సూపర్ వైజర్స్ పి, అరుణ లత, ఎన్ నాగ జయలక్ష్మి, స్కూల్ టీచర్స్, అంగన్వాడీ కార్యకర్తలు, రాజవొమ్మంగి మహిళా పోలీస్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు : అల్లూరి జిల్లా బాలికలు చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుండాలని మండల విద్యాశాఖ అధికారి రాంబాబు, ఐసిడిఎస్ వివో పి విజయ్ కుమారి తెలియజేశారు. గురువారం జాతీయ బాలికల దినోత్సవంను పురస్కరించుకొని మండలంలో గల అంగన్వాడి కేంద్రాల్లో జాతీయబాలికల దినోత్సవ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించడం జరిగింది. అనంతరం రావణా పల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో గర్ల్ చైల్డ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాంబాబు ఐసిడిఎస్పిఓ విజయ్ కుమారి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో రాయించినప్పుడే మంచి గుర్తింపు వస్తుందని, కనిపించిన తల్లిదండ్రులకు పుట్టు పెరిగిన ప్రాంతానికి సార్థకత తీసుకురావడానికి దోహదపడుతుందని దానికి ప్రతిఒక్కరు ఇప్పటినుండే పునాది వేసుకోవాలని వారు సూచించారు. అదేవిధంగా ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పోషకాహారం విలువలు కలిగిన ఆహారాన్ని నిత్యం తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వివిధ రంగాల్లో మెలికవులు గురించి స్పష్టంగా విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు జాతీయ బాలికల దినోత్సవంగుర్తుండేలా సిగ్నేచర్ క్యాంపు నిర్వహించడంతో విద్యార్థుల్లో ఆనందానికి అవధులు లేవని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు

అంగన్వాడీ కార్యకర్తలు ఉపాధ్యాయులు సిఆర్పిభాను తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ : మండలంలోని జామ్ కూడా బాలికల

ఆశ్రమ పాఠశాలలో స్థానిక సిడిపిఓ నీలిమ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అప్పలమ్మ, మాట్లాడుతూ సమాజంలో బాలికల సంరక్షణ, విద్య, ఆరోగ్యం, హక్కులు, సామాజిక ఎదుగుదల, వంటి పలు అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్స్, ఉపాధ్యాయులు అంగన్వాడి వర్కర్స్ విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : బాలికల జీవన విధానంలో వచ్చే మార్పులు, వాటిని ఎదుర్కొనే విధానాలను ప్రతి బాలికకు తెలియజేసే అవసరం ఎంతైనా ఉందని స్థానిక ఐసిడిఎస్ సిడిపిఓ జివి రమణ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధి తాజంగి సెక్టారులోని తాజంగి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం “ బేటి బచావో బేటి పడావో “కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా కస్తూర్బా గాంధీ విద్యాలయంలో వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ ద్వితీయ విజేతలుగా నిలిచిన పదవ తరగతికి చెందిన ఆర్ పల్లవి, ఇంటర్మీడియట్కు చెందిన ఎం.రామలక్ష్మి లకుబహుమతులు ప్రధానం చేశారు. అనంతరం తాజంగి గ్రామంలో బేటి బచావో బేటి పడావో బ్యానర్ పట్టుకుని బాల్యవివాహాలు వద్దు చదువే ముద్దు అంటూ నినాదాలు

చేశారు. ఈ సందర్భంగా సిడిపిఓ రమణ మాట్లాడుతూ నేటి బాలికలే రేపటి మాతృమూర్తులు అన్నారు. విద్యార్థి దశలో సంపూర్ణంగా విద్యావంతులు అయితేనే భవిష్యత్తు బంగారు బాట అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఏ సిడిపిఓ ఎం రామలక్ష్మి, సూపర్వైజర్లు విజయ కుమారి, సిహెచ్ సత్యవతి, షేక్ గౌహరున్నీషా, పి అప్పల నరసమ్మ, గౌరీ, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్, కే సుమా మాధురి, సైన్స్ టీచర్ వి వరలక్ష్మి, పాఠశాల విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిని బలోపేతం చేయండి

యుటిఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర-బెలగాం : ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని, వాటిని నిర్వీర్యం చేయకూడదని యుటిఎఫ్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేసారు. గత రాష్ట్ర ప్రభుత్వం జిఓ 117 ద్వారా పాఠశాల విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందని, దానికి ప్రత్యామ్నాయంగా ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ప్రాథమిక విద్యారంగాన్ని మరింత కూనరిల్లేలా చేసేలా ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. స్థానిక బెలగాంలో గల సుందరయ్య భవనంలో శుక్రవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో “విద్యారంగ పరిణామాలు - మన ఊరి బడి” అనే అంశంపై యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. భాస్కరరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ప్రభుత్వం క్లస్టరి విధానం మరియు జిఓ నెం. 117కు ప్రత్యామ్నాయాల పేరిట పాఠశాల విద్యలో కీలక మార్పులకు మెమోనెం. ఇఎస్ఇ02-13021/14/2024-ఇ-1 తేది09-01-2025 ద్వారా సన్నాహక సూచనలు ఇచ్చింది. దీని ద్వారా గతంలో ఉన్నత పాఠశాలలకు కలిపిన 3,4,5 తరగతుల విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలకు తిరిగి చేర్చడం, 60మంది విద్యార్థులు దాటిన ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్పుచేసి

తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించటం వరకు ఉపయుక్తంగా ఉన్నాయి కాని ముందు ప్రకటించిన విదంగా ప్రతి గ్రామ పంచాయితీకి మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటుకు చర్యలు లేవు. అంతేకాకుండా ప్రస్తుతం 1 నుండి 5 తరగతుల వరకు ఉన్న అనేక పాఠశాలలను ఫౌండేషన్ స్కూళ్లుగా మార్చి 1,2 తరగతుల్ని అక్కడ ఉంచి 3,4,5 తరగతుల విద్యార్థులను సమీప మోడల్ ప్రాథమిక పాఠశాలలకు తరలిస్తున్నారు. ఈ విధంగా పార్వతీపురం మన్యం జిల్లాలో 115 ప్రాథమిక పాఠశాలలు కొత్తగా ఫౌండేషన్ స్కూళ్ల స్థాయికి దిగజార్చబడ్డాయి. పరిణామం యుపి పాఠశాలలు అన్నింటిని ప్రాథమిక పాఠశాలలుగా మార్పుచేసి 6,7,8 తరగతుల విద్యార్థులను సుమారు 5.కిమీ దూరంలో ఉండి ఉన్నత పాఠశాలలకు తరలించబోతున్నారు. ఈవిధంగా మన్యం జిల్లాలో ఉన్న 92 యండి పాఠశాలలు 1326 ఎంపి పాఠశాలలకు కుదించబడుతున్నాయి కానీ వీటిని కూడా ప్రాథమిక పాఠశాలలుగా మార్చివేయాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చారని సమాచారం. హైస్కూల్ ప్లస్ పాఠశాలలు 6 నుండి 12 తరగతుల వరకు ఉన్న 24 పాఠశాలలను 6-10 తరగతులు ఉన్న ఉన్నత పాఠశాలలుగా దిగజార్చుతున్నారు. ఈ తిరోగమన చర్యలు ఆపాలని డిమాండ్ చేస్తూ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1-5 తరగతులు నిర్వహించాలని, ప్రతి గ్రామ పంచాయితీకి కనీసం ఒక మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలని, యుపి పాఠశాలలను కొన సాగించాలని, పాఠశాల సహాయకులను కేటాయించాలని, అన్ని పాఠశాలల్లో సమాంతరంగా తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాల్ని నిర్వహించాలని, హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో 6 నుండి 12 తరగతులు కొనసాగించి, పిజిటిలను కేటాయించాలని ఈ డిమాండ్లపై ప్రభుత్వంపై ఒత్తిడి తేవటానికి అన్ని ప్రజాసంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులను కలుపుకుని ఈ నెల 28 వ తేది నుండి నెలాఖరులోగా మండల కేంద్రాల్లో నిరసనలు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించటం చేయాలని నిర్ణయించారు. ఫిబ్రవరి 3వ తేదీన జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం చేయటానికి నిర్ణయించారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. మురళీ మోహనరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు పి. రాజశేఖర్, కాంట్రాక్ట్ ఔట్ పోస్టింగ్ నాయకులు బి. వెంకటరమణ, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, సిఐటియు నాయకులు బి. సూరిబాబు, గిరిజన సంఘం నాయకులు వి. రామస్వామి, అంగన్వాడీ నాయకులు జ్యోతి మాట్లాడారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు జడ్పీ చైర్మన్ సుభద్ర శంకుస్థాపన

విశాలాంధ్ర-అనంతగిరి : మండలంలో కాశీపట్నం, కొండిభా, టోకూరు పంచాయతీలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర శంకుస్థాపన ప్రారంభోత్సవాలు నిర్వహించారు. గురువారం నాడు అరకులోయ శాసనసభ్యులు రేగం మత్యలింగం, అనంతగిరి జిల్లా పరిషత్ సభ్యులు గంగరాజు, మండల పరిషత్ అభివృద్ధి అధికారిని శెట్టి నిలవేణి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ కొర్ర రామలక్ష్మి, కో ఆప్షన్ నెంబర్ షేక్ మదీనా, కాశిపట్నం ఎంపిటిసి సన్యాసిరావు, సర్పంచ్ జనపరెడ్డి లక్ష్మి, లు కలిసి కాశీపట్నం పంచాయతీ పరిధిలో సీతంపేట గ్రామానికి 5 లక్షల రూపాయలు జిల్లా పరిషత్ నిధులతో సీసీ ర్యాంపు శంకుస్థాపన, 11 లక్షలతో కొండిభ మంచినీటికి, టోకూరు మంచినీటి పథకానికి 10 లక్షలు ఖర్చుతో పూర్తి చేసి గురువారం నుంచి ప్రజలకు అందిస్తున్నామని జిల్లా పరిషత్ చైర్మన్ సుభద్ర తెలిపారు. పదవి బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే కొండిబా పంచాయితీకి పర్యటించి హామీ ఇచ్చే కొండిబా పంచాయితీ కేంద్రానికి ఎప్పటినుంచో మంచినీటి సమస్య నీ పరిష్కరించామని తెలిపారు. సీతంపేట గ్రామానికి సిసి రోడ్డు కావాలని ఎస్టీ కమిషన్ మెంబర్ కొర్రా రామలక్ష్మి వినతి మేరకు అలాగే బొందుగుడా గ్రామానికి ఐదు లక్షలు మంజూరు చేశామని చైర్మన్ తెలిపారు. మండల విస్తీర్ణం ఎక్కువగా ఉన్నందున అభివృద్ధికి నిధులు ఎక్కువ అవసరమని అందుకు జిల్లా పరిషత్ నుంచి తగు ప్రతిపాదనలు సిద్ధం చేసి అభివృద్ధి దిశగా పరుగు పెట్టించాలని ఎంపీపీ నీలవేణి కోరగా వచ్చిన నిధులను 37 మండలాలకు పంపకం చేయాలని

అయినప్పటికీ అనంతగిరి మండలం జిల్లా పరిషత్ మెంబర్ గంగరాజు ఎప్పటికప్పుడు సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించడం వల్ల ఎక్కువగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు గుమ్మకోట సర్పంచ్ పాగి అప్పారావు, చిలకల గడ్డ సర్పంచ్ మజ్జి అప్పారావు, కార్యకర్తలు కొర్ర సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి జన్మన్ గృహాలను సద్వినియోగం చేసుకోండి

గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్బాబు

విశాలాంధ్ర-చింతపల్లి : ప్రధానమంత్రి జన్ మన్ గృహాలను సద్వినియోగం చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి బాబు అన్నారు. మండలంలోని అంజలి శనివారం పంచాయతీ లో గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఆ శాఖ ఏఈ రమణబాబు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. అల్లూరి జిల్లాలో ఇప్పటివరకు మొదటి, రెండవ విడతలలో 25, 578 గృహాలు మంజూరయ్యాయని అదే క్రమంలో నావ్ మోటా డేటాలో మరో 3,005 గృహాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇలా ఇప్పటివరకు 28,583 మంజూరు కావడం జరిగిందన్నారు. అంజలి శనివారం పంచాయతీకి మూడవ విడతలో భాగంగా జిల్లా కలెక్టర్ చొరవతో 229 గృహాలు మంజూరు అయ్యాయన్నారు. ఈ సందర్భంగా గృహాలు మంజూరైన లబ్ధిదారులంతా కలెక్టర్కు ధన్యవాదాలు తెలిపారన్నారు. ఈ లబ్ధిదారులంతా భార్యాభర్తలు ఇరువురు బ్యాంక్ ఖాతాలను కేవైసీ చేయించుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ సర్పంచ్ పేట్ల రాజబాబు, గృహ నిర్మాణ శాఖ ఏఈ రమణబాబు, వర్క్ ఇన్స్పెక్టర్ రాజారావు, అధికసంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

తెదేపా తీర్థం పుచ్చుకున్న వైకాపా నాయకులు

కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ ఈశ్వరి

విశాలాంధ్ర-చింతపల్లి : మండలంలోని చౌడుపల్లి పంచాయతీ కొత్త పాకలు గ్రామానికి చెందిన పలువురు వైకాపా నాయకులు లోతుగెడ్డ సర్పంచ్ చింతర్ల సునీల్, ఎంపిటిసి బాబూరావుల ఆధ్వర్యంలో తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. తెదేపా పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి శుక్రవారం చింతపల్లి మండల పర్యటనలో భాగంగా కొత్త పాకలు గ్రామంలో లోతు గెడ్డ సర్పంచ్ సునీల్ ఎంపీటీసీ సభ్యుడు బాబురావు ఏర్పాటుచేసిన రచ్చబండ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె సమక్షంలో గ్రామానికి చెందిన వైకాపా నాయకులు తెదేపాలో చేరారు. వారికి గిడ్డి ఈశ్వరి పార్టీ కండువాలు వేసి సాధరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామస్తులు ఆమెకు పూలమాలలు వేసి, దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వ%శీ% అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నామని, అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తోనే మన్య ప్రాంతం అభివృద్ధి సాధ్యమని నమ్ముతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, సీనియర్ నాయకుడు చల్లంగి లక్ష్మణరావు, పెదిరెడ్ల బేతాళుడు, అబ్బాయి నాయుడు, యశ్వంత్, మాజీ ఎంపీటీసీ కంతం నాయుడు, శెట్టి నాగేశ్వరరావు, అరడ వీరబాబు, కుందూరు రాజు, వెంకట్రావు, అధిక సంఖ్యలో మహిళలు, ఎన్డీఏ కూటమి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫైలేరియా నివారణ కార్యక్రమం విజయవంతం కావాలి

జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - బెలగాం : వచ్చే నెల 10 నుంచి 12వ తేదీ వరకు జిల్లాలో జరగనున్న ఫైలేరియా నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది నవంబర్ మాసంలో నిర్వహించిన సర్వేలో బలిజిపేట మండలంలో ఫైలేరియా కేసులు ఎక్కువగా ఉన్నట్లు తేలిందన్నారు. అందులో భాగంగా జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎండిఎ) కింద డిఈసి, ఆల్బెండజోల్ మాత్రలు మింగించాల్సిన అవసరం ఉందని అన్నారు. కావున వైద్యాధికారులు బృందాలుగా ఏర్పడి అవగాహన కల్పిస్తూ, ఫిబ్రవరి 10 నుంచి మందులను పంపిణీ చేయాలన్నారు. డిఈసి, ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయడమే కాక, వాటిని తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని అన్నారు. ఫిబ్రవరి 10 నుంచి వాలంటీర్లు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలను ఇంటి వద్దకు వెళ్లి ఫైలేరియా మందులను తినిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంపై ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఈసమావేశంలో డిఎంహెచ్ఓ డా. ఎస్. భాస్కర రావు, నోడల్ అధికారి డా. ఎం. వినోద్ కుమార్, డిపిఓ టి. కొండలరావు, బిసి సంక్షేమ శాఖాధికారి కృష్ణ, ఇతర వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

చేతి బోరు పంపునకు మరమ్మతులు

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా, మండలం లోనివి.ఆర్. పురం బీసీ కాలనీ హరిజనవాడలో జమాల్ ఖాన్ చారిటబుల్ సంస్థ ద్వారా చేతి పంపుకు బోరు దింపడం నిర్వహించారు. వ్యవసాయ కూలీలకు గ్రామ ప్రజలకు అందరికీ ఉపయోగకరంగా ఉండే ఈ బోరు పంపు వేయడం ద్వారా అక్కడ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. జమాల్ ఖాన్కు వారి సంస్థకి ప్రత్యేక ధన్యవాదాలు అక్కడ ప్రజలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో మోదుగు వెంకన్నబాబు, ముత్యాల రామారావు ఎక్స్ జెడ్పిటిసి, బీరక ప్రకాశరావు, బురక కన్నారావు, సవలం రాజు, హరిబాబు, సాయిబాబు, ఉంగుటూరి వెంకటేష్, బింగి సీతమ్మ, పేరం రెడ్డి తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

పశు సంపద, ఆర్థికాభివృద్ధి ప్రభుత్వ ఆశయం

విశాలాంధ్ర-బెలగాం/సీతానగరం : గ్రామాల్లో పాడి పశు సంపద వృద్ధి చెంది పాడి రైతులు ఆర్థిక పరిపుష్టి చెందాలన్నదే ప్రభుత్వ ఆశయామని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. సీతానగరం మండలం కృష్ణరాయపురంలోని పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పశుపోషణతో జీవన ప్రమాణాలు పెంపొందించుకునే విధంగా ప్రభుత్వం వివిధ పథకాలతో పాడి రైతులకు ఊతమందిస్తుందన్నారు. ఇందులో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది 390 వరకు గోకులాల షెడ్ల నిర్మాణాలకు మంజూరు చేసామన్నారు. పశు కిసాన్ రుణ కార్డులను అందజేసి లక్షా అరవై వేల వరకు ఎటువంటి పూచీకత్తులు లేకుండా పశు పోషణ నిర్వహణ, పశు గ్రాసాలు కొరకు జీరో వడ్డీతో రుణాలను అందిస్తున్నామని వెల్లడించారు. సహాయక సంఘ సభ్యులకు ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు కొనుగోలుకు రూ.30 వేల వరకు ఆర్థిక సహాయాన్ని అందజేసి మహిళల ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా చేయూతనందిస్తున్నామన్నారు. రైతులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాడి రైతులపై భారం పడకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించి పశువులకు, జీవాలకు ఉచితంగా టీకాలను వేస్తున్నారన్నారు. పశుగ్రాస క్షేత్రాలను నిర్వహించేందుకు రైతులు ముందుకు రాగా తక్షణమే మంజూరు చేయాలన్నారు. వెంకటసాగరం నుండి రాం కొనేరు వరకు ఆక్రమణలను తొలగించి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరగా రెవెన్యూ, జలవనల శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు పశు సంచార పశు ఆరోగ్య సేవ వాహనాన్ని పరిశీలించి పశు వైద్య చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని పశు సంవర్ధక అధికారులను కోరారు. అనంతరం నెల నుంచి 12 నెలల దూడలు ఆరోగ్యంగా ఉండేవిధంగా సంరక్షణ కొరకు రైతుల్లో స్ఫూర్తి నింపేందుకు నిర్వహించిన పశు దూడల ర్యాలీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన దూడల రైతులకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. జిల్లా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్. మన్మథరావు మాట్లాడుతూ పశువులు ఆరోగ్యంగా ఉండే విధంగా మినరల్ పౌడర్, పశు దాణాను పాడి రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎదకురాని పశువులకు సకాలంలో ఎదకు వచ్చే విధంగా ఉచిత టీకాల కార్యక్రమం, జీవాలకు నులు పురుగుమందులు, టీకాలు, కోళ్లకు వైరస్ లు సోకుండా టీకాలు వేసే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, జడ్పిటిసి మామిడి బాబ్జి, సర్పంచ్ అన్నం నాయుడు, తహసీల్దార్ ప్రసన్న కుమార్, ఎంపిడిఓ త్రివిక్రమ్, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ దీనా కమార్, డా. కత్తుల ప్రసాద్, పశు వైద్యులు డాక్టర్ రామారావు, చక్రధర్, జానకి రామ్, గ్రామ సచివాలయ పశువైద్య సహాయకులు, పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు

నిర్వాసిత కుటుంబాలకు భరోసా కల్పించండి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రంలోని వరద ముంపునకు గురైన గ్రామాల నిర్వాసిత కుటుంబాలకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రెండువేల ఇరవై రెండులో వచ్చిన వరదల కు నీటమునిగిన గ్రామాలు పునరావాసం జాబితాలో చేర్చాలని ఎన్నిసార్లు గగ్గోలు పెట్టినా సంభందిత అధికారులు కనీస భాధ్యతగా ఏంటని ప్రశ్నించే అధికారి కానరాని వైనం.... తరతరాల నుండి తాతలు తండ్రులు నుండి సంక్రమించిన అస్తులు ఏటా వచ్చే గోదారి నీట మునుగుతుంది. అసలు కనీసం సర్వే చేసి భరోసా కల్పించే అధికారి కానరాని వైనం.. ఎన్ని సార్లు వరదలు వచ్చాయి? ఆ వరదలు వచ్చినప్పుడు ఎన్ని సార్లు ఆ ఇల్లు నీట మునిగాయి అనే విషయం ఎవరికీ తెలుసు.. వరదలు వచ్చినప్పుడు తట్టాబుట్టా సర్దుకుని పోయేరోజులు కాదు. ఒక మధ్యతరగతి కుటుంబంలో కావలసిన సదుపాయాలు తో కూడిన ఇల్లు సామానులు తరలించడం అంటే పెద్ద సవాలు తో కూడిన విషయం. ఇదంతా ఎందుకు అంటే మళ్ళీ వచ్చే వరదలకు ఈ ఇల్లు నీట మునిగి ఈ సారి నేలమట్టం అవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే పలుమార్లు వచ్చిన వరదలకు అక్కడి ఇల్లు బీ టలుబారాయి.. అధికారుల కాంటూరు లెక్కలు వేసుకొని కూర్చుంటే ఎప్పుడు ఈ గ్రామం సర్వే చేసేది??. ఆ ఊరు ఏంటని అడిగితే అదే రేఖపల్లి లో ఉన్న అంబేత్కర్ కాలనీ ఇక్కడ సుమారు డెభై కుటుంబాలు నివసిస్తున్నారు. ఈ గ్రామం రేఖపల్లి లో ఉన్నప్పటికీ పక్కనే ఉన్న రాజు పేట కాలనీ కంటేముందే నీట ముగుతుంది. గత ఏడాది లో వచ్చిన వరద కు ఇల్లు పూర్తిగా నీట మునిగి చెట్లు మాత్రమే కనిపించాయి...ఇదంతా అధికారులకు తెలుసు.. అయితేనేం వాళ్ళకి కావలసింది కాంటూరు కాకి లెక్కలు మాత్రమే! ఇప్పటికే పలుమార్లు పోలవరం ఇరిగేషన్ అధికారులు చుట్టూ తిరుగుతూ ఉన్న ఎవరికి ఏమి పట్టదు....మళ్ళీ వచ్చే వరదలు కు ఆ గ్రామం లో సగం ఇల్లు పడిపోతే ... పడిన ఇళ్లకు సర్వే చేస్తారా...??? అని గతంలో ఒక అధికారిని అడిగితే ! ఇలా అన్నారు. మీ కాలనీ సర్వే చేయాలి అంటే..!! రేఖపల్లి మొత్తం సర్వే చేయాలి!! అని బదులిచ్చారు.. రేఖపల్లి 45 కాంటూరు లో ఉంది.. మరి ఎలా ?? ప్రభుత్వ అధికారి కి ఒక గొప్ప రూల్ ఉంది. ఒక గ్రామం సగమే మునుగుతుంది అక్కడికే పరిగణించి సర్వే చేయమంటే కుదరదట.... అదే ఒక గ్రామాన్ని సగమే నీటమునుగుతుంది అక్కడికి సర్వే చేస్తారట చేశారు కూడా...ఆ గ్రామం వి.ఆర్.పురం బీసీ కాలనీ ... ఇంతమంది నిర్వాసితులు తలరాతలు నేలమట్టం చేసి వారి ఆర్తనాదాలు తో నిర్మించే ప్రాజెక్టు ఎవరి కోసం ఎవరి బాగోగులు కోసం వీ రి త్యాగాలు... వీ రోచిత పోరాటాలు చేసివారి గాథ లు అందరికీ గుర్తుంటాయి అంతకు మించి త్యాగం చేసే వీరి కథలు ఎవరు వింటారు ..... అధికారుల మేల్కొండి నిర్వాసిత కుటుంబాలకు భరోసా కల్పించండి.. అంటూ ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పశు ఆరోగ్య శిబిరం

విశాలాంధ్ర-బలిజిపేట : మండల పరిధిలో బైరిపురం. నూకలవాడ. అరసాడ గ్రామాల్లో మండల పశువైద్య అధికారి జి.గణేష్ శుక్రవారం పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నట్టల నివారణ మందులు 225 పశువులకు గర్భకోశ చికిత్స 66 పశువులకు చికిత్స వైద్యం జరిగిందన్నారు. రైతులు అందరూ మూగజీవుల పట్ల కొంత అవగాహన కలిగి ఉండాలని ఏ వయసులో ఏ వ్యాక్సిన్ వినియోగించుకోవాలో స్థానిక పశు వైద్య అధికారులు కనుక్కొని వ్యాక్సిన్ పశువులకు వేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పశు వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సమైక్య కార్యాలయంలో ఉల్లాస్ వాలంటీర్లకు శిక్షణ

విశాలాంధ్ర-సీతంపేట : ఐటిడిఏలోగల మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉల్లాస్ వాలంటీర్లకు ఒకరోజు శిక్షణ ఇవ్వడం జరిగినది. 176 మందికి స్టేషనరి కొనుగోలు నిమిత్తం ఒక్కొక్కరికి రూ.400/ ఇవ్వడం జరిగినది. ప్రతి ఎస్ఎస్జికి ఒక వాలంటీర్ అంగన్వాడీ కేంద్రంలో వయోజన విద్య అందించాలి అని చెప్పడం జరిగినది అని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, సీసీలు, ఏపీఎం సుశీల, వరలక్ష్మి, రోజా రమణి, సావిత్రి, వాలంటీర్ లు, విఓఎస్లు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్కు శుభాకాంక్షలు తెలిపిన ప్రజలు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : జిల్లా కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ జన్మదినం సందర్భంగా జాయింట్ కలెక్టర్ కార్యాలయం, సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారులు, సిబ్బంది జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పుష్ప గుచ్ఛాలు, మొక్కలు అందచేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్వతీపురం సాలూరు పాలకొండ కురుపాం నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు, ప్రైవేట్ సంస్థల యజమానులు, ప్రజలు కలెక్టర్ ఛాంబర్లో కలసి శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజనేతరులకు గిరిజనులే బినామీలు..?

వ్యవస్థ నాశనం కావడానికి ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులే కారణం?!

బినామీలను గుర్తించి ప్రభుత్వ రాయితీలు. రేషన్ కార్డులు రద్దుకు సిఫార్స్ చేయాలి

విశాలాంధ్ర-పాడేరు : గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల హక్కులు, చట్టాలు రోజురోజుకు అమలుకాకుండా పోతున్న పరిస్థితి ప్రస్తుతం ఏర్పడిందని, గిరిజనుల ప్రత్యేక జీవో కూడా దినదినం రద్దు చేసే ప్రయత్నమే గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని ప్రభుత్వం చూస్తుంది అనడంలో ఎటువంటి సందేహమే లేదని చెప్పకతప్పదు. ఉదాహరణకు జీవో నెంబర్ 03 ఇది గిరిజనులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే ఓ గొప్ప జీవో అటువంటిది అడ్రస్ లేకుండా అయిపోంది. దీనికి గిరిజన ప్రాంత ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు గిరిజనుల పక్షాన చట్టసభల్లో గళం విప్పి మాట్లాడకాపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా చెప్పక తప్పదు ఇదిలా ఉంటే గిరిజనుడి గుండెకాయ లాంటి 1/70 చట్టాన్ని గిరిజన ప్రాంతాల్లో పూర్తిగా రెవిన్యూ అధికారులు, పంచాయతీ అధికార్లు గిరిజనేతరులతో కుమ్మకై కాసులకు కాకుర్తిపడి సర్వనాశనం చేశారనడానికి పాడేరు జిల్లా కేంద్రంతో పాటు పక్కా పంచాయతీ చింతల వీధి గా ముక్తకంఠంతో చెప్పవచ్చు... కాగా రెవిన్యూ అధికార్లు, పంచాయతీ అధికార్లు,గిరిజనేతరుల మాయ మాటలు నమ్మి స్వయానా మన గిరిజనులే బినామీలుగా ఉంటూ వారికి సహాయ సహకారాలు అందజేస్తు ప్రభుత్వ భూములు ఆక్రమణ చేసి అమ్మేసిన వారు కూడా లేకపోలేదు. మరికొంతమంది సొంత భూములు కూడా బినామీలుగా వ్యవహరిస్తూ వారికి అమ్మి భవనాలు, వ్యాపార సముదాయాలు నిర్మాణాలు చేపిస్తున్నారు. ఎవరైనా అడిగితే మాదే అంటూ గిరిజనులు అహంకారం తో ముందుకు వస్తున్నారు. బినామీ వ్యవస్థ రూపుమాపాలనుకొంటే ప్రజా సంఘాలు ముందుకు వచ్చి సమగ్రమైన సర్వే నిర్వహించి గుర్తించి తాత తండ్రుల నుండి వారి ఆర్థిక వనరులు గుర్తించి వీళ్లకు ఇంత పెద్దమొత్తంలో ఇప్పుడు సొమ్ము ఎలా వచ్చింది అనే దానిపై వివరాలు సేకరించి బినామీ నిరూపణ కాగానే రేషన్ కార్డులు రద్దుకు సిఫార్స్ చేయాలి, అలాగే ఎన్ కమ్ టెక్స్ కట్టించి ప్రభుత్వనికి ఆదాయం వచ్చేటట్లు చూడాలి, ప్రభుత్వ పరంగా అందే రాయితీలను పూర్తిగా రద్దు చేయాలని సంబంధిత అధికారులకు డిమాండ్ చేస్తే తప్ప బినామీ వ్యవస్థ రూపుమాపాలేమని విశ్లేషకులు అంటున్నారు. కావున విశ్లేషకుల అనుభవాన్ని పరిగణంలో తీసుకొని ప్రజా సంఘాలు ముందుకు వస్తారో...? లేదా అమ్ముడు పోయి ముసుకొని కూర్చొంటారో వేచిచూడాల్సిందే.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎవిఎస్ఎం అప్పారావు

విశాలాంధ్ర-చింతపల్లి : చింతపల్లి, జీకే వీధి మండలాల్లోని విద్యుత్ సరఫరాలో పలు గ్రామాలలో విద్యుత్ లైన్‌లకు నేడు (శనివారం) మరమ్మత్తులు నిర్వహిస్తుండడంతో ఈరోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ, పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎవిఎస్ఎం అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు చింతపల్లి మండల పరిధిలోని అన్నవరం, లోతుగెడ్డ, బలపం పంచాయతీల పరిధిలోను, అదేవిధంగా గూడెం కొత్తవీధి మండలంలోని రింతాడ, సంకాడ, పెదవలస, దేవరాపల్లి, రంపుల తదితర పంచాయతీల పరిధిలోని గ్రామాలు ఉన్నాయని, శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గల సమయం లో విద్యుత్తు సరఫరా లో అంతరాయం ఉంటుందని, ఈ పరిస్థితిని విద్యుత్ వినియోగదారులు అర్థం చేసుకొని విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

డబ్బులు ఇచ్చుకో డీలర్ పోస్ట్ తీసుకో...

నేటి ప్రజా నాయకులు పరిస్థితి

విశాలాంధ్ర-బలిజిపేట : అంపావల్లి నారాయణపురం వెంగాపురం బలిజిపేట డీలర్ పోస్టులు ఖాళీ ఉండటంతో వారిని వాటిని భర్తీ చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తుండగా మధ్యవర్తుల దళారితనంతో ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికే డీలర్ పోస్టు ఇస్తామని స్థానిక కలకలం రేపుతుంది వందలు కాదు వేలు కాదు ఏకంగా ఆరు నుంచి పది లక్షల వరకు డబ్బులు ఇస్తేనే మీకు డీలర్ పోస్టు ఇస్తామని టిడిపి నాయకుల్లో ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి నియోజకవర్గ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ఏకపక్షరీతిలో అంతా నేనే అంటూ టిడిపి నాయకులు బలంగా వినిపిస్తున్నాయి ప్రజల్లో ఈ ప్రభుత్వం అంతా డబ్బుతోనే పని లేకపోతే బ్రతకలేమంటూ వాపోతున్నారు.

26న ప్రభుత్వ పెన్షన్‌దారుల సమావేశం

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం సబ్ ట్రెజరీ పరిధిలోని పింఛనుదారుల సమావేశం ఈనెల 26వ తేదీ ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక రైతు బజారు సమీపంలో ఉన్న ఆం.ప్ర రాష్ట్ర పెన్షన్ దారుల సంఘ భవనం నందు జాతీయ జెండాను సంఘ అధ్యక్షులు గంట జగన్నాథం ఎగురవేయుదురని సంఘ కార్యదర్శి దొడ్డంకి గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం నెలవారీ సమావేశం జరుగునని ఈ సమావేశంలో తే21-01-2025దీన రాష్ట్ర సమావేశంలో చర్చించిన విషయాలు, తీసుకున్న నిర్ణయాలు తెలియజేయడమగునని తెలిపారు. కావున పింఛనుదారులందరూ ఆదివారం ఉదయం 8-30 గం.లకు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసినదిగా కోరారు.

పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర-సీలేరు : జీకేవీధి మండలం గాలికొండ పంచాయితీ బాటినూరు గ్రామంలో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేసి వివిధ రకాల వ్యాధులకు మందులు పంపిణీ చేసినట్టు పశువైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో నట్టల నివారణ టీకాలు గర్భకోస పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ శిబిరంలో 190 ఆవులు, 63 దూడలు, 275 గొర్రెలు, మేకలకు వైద్య పరీక్షలు నిర్వహించి వాటి నివారణకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయితీ సర్పంచ్ కాకూరి బుజ్జిబాబు, ఇతర పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-హుకుంపేట : పశు వైద్య శిబిరాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్య అధికారి డాక్టర్ కె చరణ్ కోరారు. శుక్రవారం ఈ కార్యక్రమం లో భాగంగా మాట్లాడుతూ మండ లంలోని గూడ పంచాయతీ కోడెలి, హుకుంపేట పంచాయితీ డిచింతల వీధి, ఉప్ప పంచాయతీ మత్స్యపు రం గ్రామాలలో స్థానిక పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరలు నిర్వహించమ న్నారు. ఈ శిబిరాలలో పశువులు 436 మేకలు,గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేయడం జరిగిన దని ఆయన తెలిపారు.28 బాగోలేని మూగజీవు లకు వైద్య సేవలను అందించడం ద్వారా 123 మంది రైతు లకు మేలు కలిగిందని ఆయన అన్నారు. మూగజీ వులకు ఎటువంటి వ్యాధులు సోకిన వెంటనే స్థానిక పశువు వైద్య సహాయక సిబ్బందికి సమాచారం అందిస్తే వైద్య సేవలు అందిస్తా మన్నారు.ఈ కార్యక్రమం లో ఏహెచ్ఎలు సుజాత, చంద్రకళ, అనిల్, పద్మకుమారి, బాలన్న, బుజ్జబాబు తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువుల మరణాలను రాజకీయం చేయడం దుర్మార్గం

తెదేపా పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ ఈశ్వరి

విశాలాంధ్ర-చింతపల్లి : మండలంలోని చౌడుపల్లి పంచాయతీ వాముగెడ్డ కొత్తూరు గ్రామంలో ముగ్గురు నవజాత శిశువులు మరణిస్తే ఆ మరణాలను వైకాపా నాయకులు, ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు రాజకీయం చేయడం దుర్మార్గమని తెదేపా పాడేరు నియోజకవర్గం ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. శుక్రవారం చింతపల్లి ఏరియా ఆసుపత్రిని పార్టీ శ్రేణులతో కలిసి ఆమె సందర్శించారు. రోగులతోను, ఆసుపత్రి సూపరిటెండెంట్, డాక్టర్ జి ప్రభావతితో మాట్లాడారు, చిన్నారుల వార్డును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్థానిక ఆసుపత్రిలోనూ, విశాఖ కింగ్ జార్జ్ ఆసుపత్రిలోనూ నిపుణులైన వైద్యులు మెరుగైన వైద్యం అందించినప్పటికీ ఆరోగ్య పరిస్థితి విషమించి చిన్నారులు మృతి చెందారన్నారు. గిరిజన ప్రాంతంలో డోలీ మోతలను నియంత్రించేందుకు రహదారుల నిర్మాణానికి రూ. కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించడం జరిగిందన్నారు. శిశు మరణాలపై వైద్యనిపుణులు అధ్యయనం చేశారన్నారు. వైకాపా నాయకులు, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు శిశు మరణాలపై కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. చింతపల్లి ఏరియా ఆసుపత్రి కమిటీ చైర్మన్ గా ఎమ్మెల్యే ఉన్నారని, ఆసుపత్రి అభివృద్ధికి నిధులను ఇంతవరకు ఎందుకు ఖర్చుపెట్టలేదని ఆమె ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు, అరకు పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, ఇతర కూటమి నాయకులు, ఆసుపత్రి వైద్యాధికారిని ఇందిర ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో సీతారామ దేవాలయం ప్రారంభం

విశాలాంధ్ర-చింతూరు : మండలంలోని అల్లిగూడెం గ్రామంలో శుక్రవారం 141 బెటాలియన్ రితేష్ ఠాకూర్ కండట్ అల్లిగూడెం(అల్లూరి సీతారామరాజు జిల్లా)లో బి /42, బి /141, జి /141 సిఆర్పిఎఫ్ ద్వారా ఎస్‌హెచ్ కమలేష్ యాదవ్ 2ఐ, ఎస్ఎంటి సమక్షంలో నిర్మించిన లార్డ్ సీతా రామ మందిరాన్ని ప్రారంభించారు. ప్రీతసీ 2 ఐసీ(ఆపరేషన్), యూనిట్ మెడికల్ ఆఫీసర్లు, యస్ హెచ్ హేమంత్ కుమార్ శర్మ, చేతన్ 141 బియన్, పాఠశాల విద్యార్థులకు, చుట్టుపక్కల గ్రామస్తులకు ప్రసాదం, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మావోయిస్టుల కదలికలను అరికట్టేందుకు గత ఏడాది అల్లి గూడెంలో క్యాంపును ఏర్పాటు చేశారు. వైద్యం, క్రీడలు, సంస్కృతి కార్యకలాపాలను ప్రోత్సహిస్తు గత సంవత్సరం కాలం నుండి అనేక చుట్టూ పక్కల గ్రామల సమస్యలను పరిష్కరిస్తూ వారికి సహాయం చేస్తూ సహకరిస్తున్నందుకు చుట్టుపక్కల గ్రామ పెద్దలు, పిల్లలు తమ ప్రాంతంలో బలగాలు ఉన్నందుకు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

25న మండల సమావేశంలో వివిధ శాఖల అధికారులను నిలదీయాలి

అల్లూరి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కారే శ్రీనివాస్

విశాలాంధ్ర-సీలేరు : ఈ నెల 25న జరిగే జీకే వీధి మండల పరిషత్తు సమావేశంలో హాజరయ్యే వివిధ శాఖల అధికారులను జీకేవీధి మండల ప్రజా ప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా నిలదీయాలని జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కారే శ్రీనివాస్ కోరారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రమంతా రోడ్డు మరమ్మత్తులు జరుగుతుంటే జీకేవీధి మండలంలో ఎందుకు జరపడం లేదని ఆర్‌వీ.నగర్ నుంచి పాలగడ్డ వరకు ఉన్న అంతరాష్ట్ర ప్రధాన రహదారి విషయంలో ఎందుకు నిర్లక్ష్యం అని అధికారులను నిలదీయాలని అలాగే గత సంవత్సరం తొమ్మిదో నెలలో జరిగిన తుఫాను కారణంగా నష్టపోయిన గిరిజన రైతులకు వివిధ రకాల నష్టపరిహారం చెల్లింపులు పై అలాగే మండలంలో వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులను నిలదీయాలని ఆయన స్థానిక గూడెంకొత్తవీధి మండలం ఎంపీపీ, జడ్పిటిసిని గూడెం కొత్త వీధి మండలంలో ఎంపిటిసి లను సర్పంచులను శ్రీనివాస్ కోరారు. అన్ని మండలాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుంటే జీకేవీధి మండలంలో ఎందుకు జరగలేదని అధికారులను ప్రశ్నించాలని జీకే వీధి మండలంలో ఉండే ప్రజలు మనుషులు కాదా అని కనుక సంబంధిత అధికారులను నిలదీయాలని శ్రీనివాస్ అన్నారు.

రక్తదానం ఎంతోమందికి ప్రాణదానం

ఆసుపత్రి సూపరిండెంట్ ప్రభావతి

విశాలాంధ్ర-చింతపల్లి : రక్తదానం ఎంతోమందికి ప్రాణదానమని స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ జి ప్రభావతి అన్నారు. విశాఖ పట్నం కి చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్థానిక ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా 40 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం ఎంతోమందికి ప్రాణదానమే కాకుండా రక్తదాతలకు సైతం ఆరోగ్యదాయకం అన్నారు. ప్రతి ఒక్కరూ అవకాశం ఉన్నంత వరకు రక్తం దానం చేయడం మంచిదన్నారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి నర్సింగ్ సూపరిండెంట్ పద్మావతి, చింతపల్లి, జీకే వీధి ఎస్సైలు వెంకటేశ్వరరావు, అప్పలసూరి, బ్లడ్ స్టోరేజ్ లాబ్ టెక్నీషియన్ అనిల్, ఇండియన్ రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాడవాడలా.. మద్యం అమ్మకాలు

ఎక్కడికక్కడ వెలిసిన బెల్ట్ షాపులు

పల్లెలు, కాలనీల్లో అందుబాటులో మద్యం

బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్న వ్యాపారులు

తూతూమంత్రంగా కేసులు, దాడులతో ఎక్సైజ్ సరి

నియంత్రణలో వైఫల్యం.. మామూళ్ల వసూళ్లలో అధికారులు

విశాలాంధ్ర-ఎటపాక : ప్రభుత్వ మద్యం దుకాణాలు పోయి.. బెల్టు షాపులు వచ్చేశాయి. కావాల్సిన బ్రాండ్లు కొనుక్కోవచ్చు. తాగొచ్చు. అయితే ఎక్కడో ఉన్న వైన్సుకు వెళ్లి కొనుక్కునేందుకు ఇబ్బంది పడకుండా అందుబాటులో కూడా మద్యం దొరికే సౌలభ్యం మన మండలంలోని ఎటపాక, నెల్లిపాకా వైన్ షాపుల నుండి నేరుగా బెల్టు షాపులకు మద్యం వెళ్తుంది. ప్రతీ పల్లెలోనూ, గ్రామాల్లో పరిధిలోని కాలనీల్లోనూ ఉంది. ఇంటి నుంచి బయటకు వచ్చి సమీపంలోని బడ్డీ కొట్టుకు వెళ్తే మందు దొరుకుతుండటంతో మందుబాబులు ఖుషీఖుషీగా ఉంటున్నారు. ఆదాయం అధికంగా ఉంటుండధంతో బెల్ట్ షాపుల నిర్వహణకు పలువురు పోటీపడుతున్నారు. రూ.లక్షలు కట్టి వైన్స్ లైసెన్సు పొందిన వ్యాపారులు బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలను ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కో క్వార్టర్ బాటిల్‌కు అదనంగా రూ.30 తీసుకుని బెల్ట్ దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్నారు. వారు బ్రాండ్లను బట్టి రూ.50 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. తమ ప్రాంతం నుంచి వైన్సుకు వెళ్లకుండా అందుబాటులో మద్యం దొరుకుతుండటంతో మందుబాబులు అదనపు మొత్తాన్ని భారంగా భావించడంలేదు. ఏ సమయంలోనైనా కావాల్సిన మందు దొరుకుతుండటంతో మందుబాబులు బెల్ట్ దుకాణాలను ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు. బెల్టు షాపుల దందాపై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు మండిపడుతున్నారు. బెల్టుషాపులు యథేచ్ఛగా నడుస్తున్నా మొక్కుబడి కేసులతో ఎక్సైజ్ అధికారులు సరిపెడుతున్నారన్న విమర్శలున్నాయి. దాడుల్లో పట్టుబడ్డ మద్యం ఏ షాపు నుంచి వచ్చిందో మూలాలను కనుక్కొని వాటిపై చర్యలు తీసుకోవడంలేదనీ ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి బెల్టు షాపుల అక్రమ దందాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.